www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
హైదరాబాద్
ఆదివారం, 01.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13
సంచిక: 103
పేజీలు: 12
వెల: రూ. 5
Published From: Hyderabad

# నో ఫ్లై-జోన్
## ఏం జరుగుతోంది?



బంగాళాఖాతంలో భారత్ ప్రకటించిన భారీ 'నో ఫ్లై జోన్' దేశ రక్షణ వర్గాల్లోనే కాదు.. పొరుగు దేశాల్లో కూడా కలకలం రేపుతోంది. ఫిబ్రవరి 5, 6 తేదీల్లో 3,190 కిలోమీటర్ల విస్తీర్ణంలో విమానాల రాకపోకలపై ఆంక్షలు విధించడంతో డీఆర్డీవో ఏదైనా అత్యాధునిక లాంగ్ రేంజ్ క్షిపణి లేదా సముద్ర ఆధారిత ఆయుధ వ్యవస్థను పరీక్షించబోతోందా అన్న సందేహాలు బలపడుతున్నాయి.

- డీఆర్డీవో రహస్య క్షిపణి పరీక్షలేనా?
- ఆపరేషన్ సిందూర్ తర్వాత మారిన రక్షణ దృష్టి
- బ్రహ్మోస్ అప్‌గ్రేడ్.. సముద్ర శక్తికి పదును
- డ్రోన్లు, ఎస్–500తో బలోపేతం అవుతున్న రక్షణ వ్యవస్థ
- పొరుగు దేశాల్లో టెన్షన్ ఎందుకు పెరిగింది?
- భారత్ రక్షణ వ్యూహంలో కీలక అడుగు

09

# 'గ్రేటర్' బడ్జెట్ @రూ.11,460 కోట్లు



- వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేటాయింపులు
- ప్రకటించిన మేయర్ విజయలక్ష్మీ
- గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన నిధులు
- పాత మున్సిపాలిటీలకు రూ.9,200 కోట్లు కేటాయింపు
- విలీనమైన 27 మున్సిపాలిటీలకు రూ.2,260 కోట్లు

03

# ఆశలు.. అంచనాలు
## కేంద్ర బడ్జెట్‌పై దేశవ్యాప్తంగా ఉత్కంఠ




- నిధుల కోసం తెలంగాణ ఎదురుచూపులు
- మధ్య తరగతి జేబుకు ఊరటేనా? గృహ రుణాలపై ఆశలు
- ఆరోగ్య రంగానికి ప్రోత్సాహం.. హెల్త్ ఇన్సూరెన్స్ విస్తరణపై అంచనాలు
- క్యాపెక్స్ పెంపుతో వృద్ధికి బూస్ట్?.. కేంద్రం దిశ ఇదేనా
- పాత పన్ను విధానానికి న్యాయం జరిగేనా? స్లాబ్ మార్పులపై చర్చ
- టీడీఎస్ గందరగోళానికి చెక్?.. సరళీకరణపై నిపుణుల అంచనా
- రియల్ ఎస్టేట్, ఈవీ రంగాలకు ఊతమా? బడ్జెట్‌పై మార్కెట్ చూపు
- డెట్ ఫండ్లపై పన్ను సడలింపులపై పెట్టుబడిదారుల ఆశలు
- తెలంగాణకు ఈసారి నిధుల వరమా? లేక మళ్లీ చుక్కెదురేనా
- మెట్రో, రోడ్లు, పరిశ్రమలు.. కేంద్రంపై రాష్ట్ర ఆశల భారం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1వ తేదీన ఆదివారం ఉదయం 11 గంటలకు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలో దేశంలోని లక్షలాది మంది పెట్టుబడిదారులు, పన్ను చెల్లింపుదారుల దృష్టి ఈ బడ్జెట్‌పైనే ఉంది. ఎందుకంటే దీని ద్వారా కొంత ఉపశమనం కలిగి వారి జేబులపై నేరుగా ప్రభావం చూపుతుంది. నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న తొమ్మిదవ పూర్తి స్థాయి బడ్జెట్ అవుతుంది. ఆమె తొలిసారిగా ఆదివారం నాడు కేంద్ర బడ్జెట్‌ను సమర్పిస్తారు. కేంద్ర బడ్జెట్ పై మధ్యతరగతి వారి నుంచి నుండి జీతాలు తీసుకునే ఉద్యోగుల వరకు, రైతుల నుండి మహిళల వరకు అన్ని వర్గాలు ఆసక్తిగా ఉన్నాయి.

**ఆస్తి, గృహ రుణాలు**

ఒకవైపు భూముల ధరలు పెరుగుతుండగా, ప్రజలపై లోన్ భారం కూడా పెరిగింది. మరోవైపు గృహ కొనుగోలుదారులు పన్ను మినహాయింపు మరింత కోరుతున్నారు. గృహ రుణాలపై పన్ను మినహాయింపును పెంచాలని డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం, ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 24(బి) కింద వడ్డీపై మినహాయింపు పరిమితి రూ. 2 లక్షలు. కాగా ఇది చాలా సంవత్సరాల క్రితం నిర్ణయించారు. ప్రస్తుత పరిస్థితులలో ఇది సరిపోదని, మరింత పెంచాలని కేంద్రాన్ని కోరుతున్నారు.

**ఆరోగ్య రంగంలో అంచనాలు**

బజాజ్ బ్రోకింగ్ నివేదిక ప్రకారం, దేశంలో ఆరోగ్య మిగతా 02లో..

# ఇక అన్నీ మంచి శకునములే !
## 50 రోజుల విరామానికి తెర

- శుక్ర మౌఢ్యమి కారణమే అడ్డంకి
- ఫిబ్రవరి 18 నుంచి శుభారంభం
- మాఘం తర్వాత శుభ మాసాల పరంపర
- మే 9 వరకూ వరుస ముహూర్తాలు

09



గత రెండు నెలలుగా మూగబోయిన శుభ కార్యాల సందడి మళ్లీ మొదలుకాబోతోంది. శుక్ర మౌఢ్యమి కారణంగా నిలిచిపోయిన పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, ఉపనయనాలు ఇకపై జోరందుకోనున్నాయి. పండితుల మాట ప్రకారం ఫిబ్రవరి 18 నుంచి శుభ ఘడియలు ప్రారంభమవుతుండగా, మే వరకూ వరుసగా మంచి ముహూర్తాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇంటింటా పచ్చని తోరణాలు, డుండు డుండు బాజాల మోత వినిపించనుంది.

# రెబెల్స్ బెడద లేకుండా చూడండి
## 'పుర' ఎన్నికల్లో 90 శాతం సీట్లే లక్ష్యం.. సీఎం టార్గెట్



- అమెరికా నుంచే జూమ్ మీటింగ్.. కీలక నిర్ణయాలు తీసుకున్న సీఎం
- టికెట్ రాని వారికి న్యాయం చేస్తాం
- జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులతో ఎన్నికల సమీక్ష

03

# కౌశిక్ రెడ్డి వివాదానికి తెర
## ఎమ్మెల్యే vs తెలంగాణ పోలీస్



- సీపీపై వ్యాఖ్యలతో రగిలిన ఐపీఎస్ అసోసియేషన్
- మత ప్రస్తావనపై తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం ఆగ్రహం
- వీడియో మెసేజ్‌తో వెనక్కి తగ్గిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

09

# తాతపై ప్రేమతో..



- సిట్ నోటీసుల వేళ ఫామ్‌హౌస్‌లో కేసీఆర్
- హిమాన్షు పోస్ట్‌తో ఎమోషనల్ టచ్
- రాజకీయ ఒత్తిడుల్లోనూ ప్రశాంత సందేశం
- #KCRFarmer ట్రెండ్

10

# అమెరికాలో షట్‌డౌన్
## బడ్జెట్ గడువు ముగింపు.. అర్ధరాత్రితో ప్రభుత్వ షట్‌డౌన్




- నిధులు ఆగిపోవడంతో పాక్షికంగా నిలిచిన ప్రభుత్వ కార్యకలాపాలు
- మినియాపొలిస్ ఘటనపై సెనెట్ డెమోక్రాట్ల ఆగ్రహం
- ఐసీఈ సంస్కరణలే కీలకం..
- నిధుల బిల్లుపై డెమోక్రాట్ల హెచ్చరిక
- హోంలాండ్ భద్రత సహా కీలక విభాగాలకు నిధుల నిలుపుదల

10

# సిట్.. హీట్
## ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు కేసీఆర్ విచారణ

- దర్యాప్తునకు సహకరిస్తాన్న మాజీ సీఎం
- నేడు ఉదయం ఫాంహౌజ్ నుంచి నందినగర్ కు గులాబీ బాస్
- పార్టీ ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ
- విచారణ తర్వాత పరిణామాలపై సుదీర్ఘ చర్చ
- వీడియో గ్రాఫీ ద్వారా విచారణ ప్రక్రియ చిత్రీకరణ
- కేసీఆర్ ఇచ్చే సమాధానాలపై సర్వత్రా ఉత్కంఠ
- నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలుపు
- తెలంగాణ భవన్ కు భారీగా తరలిరావాలని ఆదేశాలు
- పోలీసుల బందోబస్తు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ.. రాష్ట్ర రాజకీయాల్లో ఉక్కసారిగా పొలిటికల్ హీటెక్కించింది. ఇప్పటికే ఈ వ్యవహారంలో పలువురు పోలీసు మాజీ ఉన్నతాధికారులు, మంత్రులు, నాయకులను విచారించిన సిట్ అధికారులు.. తుది దశలో కేసీఆర్ ను విచారించేందుకు సిద్ధమవడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. నేడు మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్ నివాసంలో అందుబాటులో ఉండాలంటూ సిట్ అధికారులు ఇచ్చిన నోటీసులపై స్పందించిన కేసీఆర్... తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించారంటూ జూబ్లీహిల్స్ ఏసీపీకి లేఖ రాయడం సంచలనం రేపింది. అసలు తనకు నోటీసు ఇచ్చే మిగతా 02లో..

# ముగిసిన వన జాతర
## జనంలో నుంచి వనంలోకి గిరిజన దేవతలు

- అశేష భక్తజనం మధ్య అమ్మవార్ల వన ప్రవేశం
- సమ్మక్క,సారలమ్మను దర్శించుకున్న సుమారు 2 లక్షల మంది
- సారలమ్మ రాకతో ప్రారంభమైన ప్రధాన జాతర ఘట్టాలు
- గద్దెలపైకి చేరిన వనదేవతలు.. భక్తులతో కిటకిటలాడిన మేడారం
- సమ్మక్క తల్లి గద్దెపై ప్రతిష్ఠతో పరాకాష్టకు చేరిన జాతర
- నాలుగు రోజుల పాటు కొనసాగిన దివ్య దర్శనాలు
- సమ్మక్క–సారలమ్మ నినాదాలతో దద్దరిల్లిన అరణ్యం
- రెండు కోట్ల మంది భక్తులతో రికార్డు స్థాయిలో హాజరు
- అంగరంగ వైభవంగా ముగిసిన మేడారం మహాజాతర



**ముద్ర, మేడారం:**

తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ముగిసింది. గత నెల 21న సాయంత్రం గిరిజన పూజారుల ప్రత్యేక పూజలతో సారలమ్మ రాకతో ప్రధాన జాతర మొదలైంది. గత నెల 28న మహాజాతర ప్రారంభమై.... శనివారం రాత్రి ముగిసింది. గత నెల 28న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి రాగా, 29న రాత్రి సమ్మక్క తల్లి గద్దెపై ప్రతిష్ఠితమయ్యారు. 30న రోజంతా నలుగురు దేవతలు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజు వనాన్ని వీడి గద్దెలకు చేరారు. జాతర చివరి అంకంలో భాగంగా శనివారం మిగతా 02లో..

# 'పుర' ఎన్నికలు మా పాలనకు రెఫరెండం
## మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి

- మున్సిపల్ ఎన్నికలను సెమీ ఫైనల్స్ గా భావిస్తున్నాం
- పదేళ్ల దొరలపాలనలో పేదలకు ఒరిగింది శూన్యం
- ఖమ్మం, మహబూబాబాద్, జనగాం జిల్లాల్లో విస్తృత ప్రచారం

09



# టీ20 వరల్డ్ కప్‌కు ముందే ఐసీసీకి తలనొప్పి

- ఆటగాళ్ల హక్కులపై ఐసీసీ, ప్రపంచ క్రికెటర్ల సంఘం మధ్య రగడ
- కొత్త ఒప్పందంతో ప్లేయర్లకు నష్టమంటున్న డబ్ల్యూసీఏ
- ఆరోపణలను తిరస్కరించిన అంతర్జాతీయ క్రికెట్ మండలి
- వివాదం ముదిరితే టోర్నీపై ప్రభావం పడే అవకాశం

11




# మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి సీఎం షెడ్యూల్

సీఎం రేవంత్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రచారం షెడ్యూల్ ఖరారైంది. ఆరు ఉమ్మడి జిల్లాలో సీఎం ప్రచారం చేయనున్నారు. ఫిబ్రవరి 4న ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడ లో సీఎం ప్రచారం ప్రారంభం కానుంది. 5న కరీంనగర్ జిల్లా చొప్పదండి, 6న నిజామాబాద్ రూరల్, 7న రంగారెడ్డి జిల్లా పరిగి, 8న ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లి, 9న మెదక్ లో ముగియనుంది.



# తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి

- హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ, ప్రస్తుత విద్యార్థులకు సీఎం పిలుపు
- గ్లోబల్ వేదికపై తెలంగాణ విజన్ ప్రచారం

03



## ఇదీ ఏఐ ముద్ర

94 ఏళ్ల వయసులో సినిమా తీయడమా? గ్రేట్ 'సింగీతం'



## ప్రపంచంలో అధిక ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలు

**వెనిజువెలా**

ప్రపంచంలోనే అత్యధిక ముడిచమురు నిల్వలు వెనిజువెలాకు ఉన్నాయి. అయితే ఆర్థిక సంక్షోభం వల్ల ఉత్పత్తి పూర్తిస్థాయిలో సాగడం లేదు.

# ఆశలు.. అంచనాలు..

(మొదటి పేజీ తరువాయి)

సేవల పరిధి నిరంతరం విస్తరిస్తోంది. నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్ 2026లో దీనిని మరింత ప్రోత్సహిస్తారని పేర్కొంది. ఎక్కువ మందిని కవర్ చేయడానికి, దీర్ఘకాలిక చికిత్స కోసం హెల్త్ ఇన్సూరెన్స్ పథకాల పరిధిని పెంచవచ్చు. అయితే, దీనివల్ల ఆరోగ్య రంగానికి సానుకూల ప్రోత్సాహం లభిస్తుంది. ప్రభుత్వ ధరలకు సేవలు అందించే విషయంలో ప్రైవేట్ ఆసుపత్రుల లాభాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని నివేదిక హెచ్చరించింది.

**మూలధన వ్యయం**

బ్రోకింగ్ సంస్థ ఆనంద్ రాఠీ ప్రకారం.. ఆర్థిక ఏడాది 2026–27లో కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత సంస్కరణల మార్గంలో ముందుకు సాగుతుంది. కేంద్ర బడ్జెట్‌లో పెద్ద లేదా ఆశ్చర్యకరమైన నిర్ణయం తీసుకునే అవకాశం తక్కువ. సంస్థ ప్రకారం, బడ్జెట్‌లో ప్రభుత్వం మూలధన వ్యయాన్ని (క్యాపెక్స్) వార్షిక ప్రాతిపదికన దాదాపు 13 శాతం పెంచి 12.6 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లవచ్చు. క్యాపెక్స్–టు–జీడీపీ నిష్పత్తి దాదాపు 3.2 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. గురువారం నాడు కేంద్రం సమర్పించిన ఆర్థిక సర్వే నివేదికలో, ఆర్థిక సంవత్సరం 2026–27కి భారతదేశ వృద్ధి రేటు 6.8 శాతం నుండి 7.2 శాతం ఉంటుందని అంచనా వేశారు. ఆర్థిక సంవత్సరం 2026కి వాస్తవ సగటు దేశీయ ఉత్పత్తి వృద్ధి రేటు 7.4 శాతం, కాగా స్థూల విలువ జోడింపు 7.3 శాతంగా ఉంటుందని అంచనా వేశారు.

**పన్ను స్లాబ్ సవరణ**

గత బడ్జెట్‌లో ప్రభుత్వం కొత్త విధానం కోసం పన్ను స్లాబ్‌లను సవరించింది, దీని వలన రూ.12 లక్షల వరకు ఆదాయం పన్ను రహితంగా మారింది. అయితే పాత విధానాన్ని ఎంచుకున్న పన్ను చెల్లింపుదారులకు ఎటువంటి ఉపశమనం లభించలేదు. ఈసారి పాత విధానంలో ఉన్నవారు కూడా ప్రయోజనం పొందేలా, ప్రభుత్వం పాత విధానం కోసం పన్ను స్లాబ్‌లలో కొన్ని మార్పులు చేయవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం వివిధ లావాదేవీలకు అనేక రకాల TDS రేట్లు వర్తిస్తాయి, దీనివల్ల పన్ను చెల్లింపుదారులు గణనీయమైన గందరగోళానికి గురవుతున్నారు. దీనిని సులభతరం చేయడానికి, ఆర్థిక మంత్రి TDS రేట్ల సంఖ్యను కేవలం రెండు లేదా మూడుకు తగ్గించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. గృహ రుణంపై అధిక మినహాయింపు.. రియల్ ఎస్టేట్ రంగం నుండి చాలా కాలంగా వస్తున్న డిమాండ్లకు ప్రతిస్పందనగా, ప్రభుత్వం గృహ రుణ వడ్డీపై పన్ను మినహాయింపును పెంచవచ్చు. ప్రస్తుతం సెక్షన్ 24B కింద అందుబాటులో ఉన్న మినహాయింపు రూ.2 లక్షల వరకు ఉంది, దీనిని రూ.4 లక్షలకు పెంచవచ్చు. ఇది గృహ కొనుగోలుదారులకు గణనీయమైన ఉపశమనం కలిగిస్తుంది. భార్యాభర్తలకు ఉమ్మడి పన్ను విధించాలని ICAI ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ వ్యవస్థ ఇప్పటికే అమెరికా, యూరప్‌లో ఉంది. అమలు చేస్తే పని చేసే జీవిత భాగస్వాముల మొత్తం పన్ను బాధ్యత గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం టర్మ్ బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంలపై తగ్గింపులు పాత పన్ను విధానంలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ బడ్జెట్‌లో కొత్త పాలసీని మరింత ఆకర్షణీయంగా మార్చడానికి ప్రభుత్వం బీమా ప్రీమియంలపై పన్ను మినహాయింపును ప్రకటించవచ్చు. మెట్రో నగరాల్లో ఇళ్ల ధరలు గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం రూ.4.5 మిలియన్ల వరకు ఖరీదు చేసే ఇళ్లను మాత్రమే సరసమైనవిగా పరిగణిస్తున్నారు. ప్రభుత్వం ఈ పరిమితిని రూ.7.5 మిలియన్లకు పెంచవచ్చు, దీని వలన ఎక్కువ మంది సరసమైన గృహ పథకాల నుండి ప్రయోజనం పొందగలరు. కాలుష్యాన్ని తగ్గించడానికి, ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి, ప్రభుత్వం EV రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించడాన్ని పరిగణించవచ్చు. ఇది ప్రజలు పెట్రోల్, డీజిల్ నుండి ఎలక్ట్రిక్ వాహనాలకు మారడానికి ప్రోత్సహిస్తుంది.

**డెట్ ఫండ్ పన్ను నియమాలలో మార్పులు**

గత బడ్జెట్‌లో డెట్ ఫండ్ల నుండి వచ్చే లాభాలను స్వల్పకాలిక లాభాలుగా పరిగణించడం ద్వారా పన్ను నియమాలను కఠినతరం చేశారు, ఇది పెట్టుబడిదారుల ఆసక్తిని తగ్గించింది. ఈసారి ప్రభుత్వం ఈ నియమాలను సడలించడం ద్వారా పెట్టుబడిదారులను తిరిగి ఆకర్షించడానికి ప్రయత్నించవచ్చు.

**బడ్జెట్‌లో తెలంగాణకు ఈ సారైనా ఊరట కలుగుతుందా..? మళ్లీ చుక్కెదురేనా..?**

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఏమేమీ వస్తాయనేది చర్చనీయాంశంగా మారింది. గత బడ్జెట్‌లో తెలంగాణకు చుక్కెదురైంది. దీంతో ఈ సారైనా ఊరట కలుగుతుందా అని రాజకీయ వర్గాలు ఆశిస్తున్నాయి. మెట్రో విస్తరణకు నిధులు కేటాయించాల్సిందిగా ప్రభుత్వం కోరుతుంది. మరి మెట్రోకు నిధులు ఉంటాయా లేదా అనేది చూడాలి.

రాష్ట్ర విభజన జరిగి పదేండ్లు దాటింది. తెలంగాణకు రావాల్సిన కీలక నిధులు, ప్రాజెక్టులు, అనుమతులు ఇంకా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే నిలిచిపోయాయి. దాదాపు 12 విభాగాలకు సంబంధించి 47 అంశాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం అనేక ఆశలు పెట్టుకుంది. హైదరాబాద్ చుట్టూ సుమారు 350 కి.మీ రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులతో పాటు రూ. 34,367 కోట్లు కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరింది. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ "రేడియల్ రోడ్ల కోసం రూ.45,000 కోట్లు అవసరమవుతుంది. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ కు కలుపుతూ కొత్తగా 10 రేడియల్ రోడ్ల అభివృద్ధి ప్రతిపాదలను సీఎం ఇప్పటికే కేంద్రానికి సమర్పించారు. వీటికి రూ. 45,000 కోట్ల నిధుల మంజూరు కోరింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 కోసం రూ.44,028 కోట్లు కోరింది. హైదరాబాద్ మెట్రో విస్తరణలో భాగంగా మెట్రో రైలు ఫేజ్–2 ప్రాజెక్టు కోసం ఫేజ్ 2A, ఫేజ్ 2B ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్లో ఉన్నాయి.

**గోదావరి–మూసీ అనుసంధానం**

గోదావరి నుంచి మూసీకి నీటిని మళ్లించే లింక్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రూ.6,000 కోట్ల ఆర్థిక సాయం కోరింది

వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ (UGD) ప్రాజెక్టుకు కేంద్ర నిధులు

హైదరాబాద్ సమగ్ర మురుగు నీటి మాస్టర్ ప్లాన్ (AMRUT 2.0 / స్పెషల్ ప్రాజెక్ట్)

బందర్ పోర్ట్ – హైదరాబాద్ డ్రై పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ హైవే – రూ.17,000 కోట్లు

"బందర్ పోర్ట్" నుంచి హైదరాబాద్ సమీప డ్రై పోర్ట్ వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదం. దాదాపు రూ.17 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టాలని కోరింది.

**విమానాశ్రయాల అభివృద్ధి**

ఆదిలాబాద్, కొత్తగూడెం, బసంత్ నగర్ విమానాశ్రయాలు, ఇటీవలే వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్ట్ లకు ఆమోదం తెలిపింది.

**రైల్వే కనెక్టివిటీ – కొత్త లైన్ల ప్రతిపాదనలు**

తెలంగాణలో 8 కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్నాయి

వికారాబాద్–కృష్ణ కొత్త రైలు మార్గం, కల్వకుర్తి–మాచర్ల రైలు లైన్, గద్వాల్–దోర్నకల్ రైలు మార్గం

కాచిగూడ–జగ్గయ్యపేట రైలు మార్గం, పటాన్‌చెరు–ఆదిలాబాద్ రైలు లైన్, బోధన్–లాతూర్ రోడ్ లైన్, అక్కన్నపేట బైపాస్ రైలు లైన్, పాండురంగాపురం–భద్రాచలం రోడ్ లైన్

**పరిశ్రమలు పెట్టుబడులు**

ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో తెలంగాణను చేర్చడం

ఖమ్మం లేదా మహబూబాబాద్ ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్.

పీఎం మిత్ర కింద కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్కు కేంద్రం సాయం

తెలంగాణ రైజింగ్ విజన్–2047 లక్ష్యానికి అనుగుణంగా లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులు

**విద్యుత్.. సింగరేణి**

పవర్ సిస్టం డెవలప్‌మెంట్ ఫండ్ కింద 6 ట్రాన్స్మిషన్ ప్రాజెక్టులు

పీఎం కుసుమ్ కింద సోలార్ పంప్ సెట్ల కేటాయింపు

సింగరేణికి బొగ్గు బ్లాకుల గుర్తింపు

తాడిచెర్ల కోల్ బ్లాక్–II మైనింగ్ లీజ్

**ఎడ్యుకేషన్**

నవోదయ విద్యాలయాలు లేని జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాల మంజూరు

కొత్త జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలు

హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (IIM)

**హౌజింగ్**

పీఎంఏవై లో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు

కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు విస్తరణ




# సిట్.. హీట్



(మొదటి పేజీ తరువాయి)

పరిధి మీది కాదని పరోక్షంగా హెచ్చరించడం చర్చనీయాంశమైంది. తాను ఎర్రవెల్లి ఫాం హౌజ్ లో ఉన్నానని చెప్పినా... నంది నగర్ ఇంటికి వెళ్లి అక్కడి గోడకు నోటీసులు అంటించడం ఏంటని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో ఇప్పటి వరకు జరిగిన విచారణలు. సిట్ అధికారులు అడిగే ప్రశ్నలు. ఇవ్వాల్సిన సమాధానాలపై శనివారం ఎర్రవెల్లిలోని తన ఫాం హౌజ్‌లో బీఆర్ఎస్ కీలక నేతలతో పాటు, న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు విచారణకు కేసీఆర్ అంగీకరించని పక్షంలో తీసుకోవాల్సిన చర్యలకు సిట్ బృందం సిద్ధమవుతుండగా.... ఇటు కేసీఆర్ సైతం సిట్ విచారణకు సానుకూలత వ్యక్తం చేశారు. అయితే ఈ విచారణ ప్రక్రియ అంతా వీడియో గ్రాఫీ ద్వారా చిత్రీకరించాలని సిట్ అధికారులు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సమాధానం చెప్పే సమయంలో అనారోగ్యం దృష్ట్యా ఆచితూచి మాట్లాడాలని కేటీఆర్, హరీశ్ రావు సూచించినట్లు తెలిసింది. మరోవైపు.. విచారణలో కేసీఆర్ పట్ల సిట్ అధికారులు వ్యవహరిస్తోన్న తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుతో పాటు సీనియర్లు ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. కాగా ఈ నెల 29న హైదరాబాద్ లోని నందినగర్ లో ఎన్న కేసీఆర్ ఇంటికి వెళ్లిన సిట్ అధికారులు.. ఈ నెల 30న విచారణకు సిద్ధంగా ఉండాలని కోరారు. కానీ అదే రోజు రాత్రి విచారణను వాయిదా వేయాలని కేసీఆర్.. సిట్ అధికారులకు లేఖ రాశారు. మున్సిపల్ ఎన్నికలు, నామినేషన్ల పర్వం కొనసాగున్న వేళ నేడు విచారణకు హాజరు కాలేనని లేఖలో పేర్కొన్నారు. తనకు కాస్త సమయం కావాలని కోరారు. ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లోనే విచారణ చేసుకోవచ్చని తెలిపారు. బాధ్యత గల పౌరుడిగా విచారణకు సహకరిస్తానని అన్నారు. దీంతో కేసీఆర్ కు సిట్ అధికారులు మినహాయింపు ఇస్తారనే ప్రచారం జరిగింది. కానీ అనూహ్యంగా గతనెల 30న న్యాయ నిపుణులతో భేటీ అయిన సిట్ అధికారులు కీలక అంశాలపై చర్చలు జరిపారు. కేసీఆర్ వయస్సు రీత్యాఆయన్ను నేడు మధ్యాహ్నం హైదరాబాద్ లోని నందినగర్ నివాసంలోనే విచారణ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అదే రోజు రాత్రి నందినగర్ ఇంటికి వెళ్లారు. అక్కడ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఇంటి గోడకు నోటీసులు అంటించారు. నేడు మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్ నివాసంలో అందుబాటులో ఉండాలని ఆ నోటీసుల్లో తెలిపారు.

**పైశాచిక ఆనందం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

నందినగర్ లోని కేసీఆర్ ఇంటి గోడకు సిట్ అధికారులు నోటీసులు అంటించడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంది రేవంత్ రెడ్డి అని నిలదీశారు. స్వయంగా కేసీఆరే తాను ఉంటున్న నివాసం అడ్రస్‌తో సహా పోలీసులకు రిప్లై ఇచ్చారన్నారు. అయినా ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గేటుకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణం అన్నారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలన్న రూల్ కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని ఆరోపించారు. అసలు మీ పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా..? లేక మీ చేతిలో కీలుబొమ్మల్లా ఇట్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా అంటూ ప్రశ్నించారు. చట్టం, న్యాయం, ధర్మం మీద మీకు గౌరవం లేకపోవచ్చు, కానీ తమకు వాటి మీద పూర్తి విశ్వాసం ఉందన్నారు. అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రభుత్వం ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని అన్నారు. మరోవైపు.. మున్సిపల్ ఎన్నికల వేళ కేసీఆర్ కు నోటీసులివ్వడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని నేతలు విమర్శిస్తున్నారు. కేసీఆర్ విచారణకు సహకరించడం ద్వారా అసలు నిజాలను బయటపెట్టవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**నేడు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు**

కేసీఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వేధిస్తోందని ఆరోపిస్తూ.. నేడు రాష్ట్ర వ్యాప్తంగా భారీ నిరసనలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ నోటీసులు జారీ చేశారని మండిపడ్డ కేటీఆర్, ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాష్ట్రంలోని 12 వేలకు పైగా గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. ప్రతి మున్సిపల్ వార్డు, నియోజకవర్గ కేంద్రాల్లో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించాలని, నల్ల జెండాలతో నిరసన తెలపాలని కేటీఆర్ సూచించారు. నగరాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో ధర్నాలు, రాస్తారోకోల ద్వారా ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు. ఇతర బీఆర్ఎస్ సీనియర్ నేతలు ప్రత్యక్షంగా పాల్గొని విజయవంతం చేయాలని కేటీఆర్ సూచించారు. ఈ నిరసన కార్యక్రమాలన్నీ అత్యంత శాంతియుతంగా జరగాలని, ఎక్కడ పోలీసులతో ఘర్షణలకు దిగవద్దని పార్టీ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసనను గట్టిగా వినిపించాలని ఆయన పేర్కొన్నారు.

# ముగిసిన వ(జ)న జాతర

(మొదటి పేజీ తరువాయి)

రాత్రి అమ్మవార్లు వనప్రవేశం చేశారు. దీంతో నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సమాప్తమైంది. గద్దెల వద్ద నుంచి డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వనంలోకి తరలివెళ్లారు. అశేష భక్తజనం ఆ ఘట్టాన్ని తిలకించి పులకించిపోయారు. సమ్మక్క, సారలమ్మ నినాదాలతో అరణ్యం దద్దరిల్లింది. కాగా ఈ ఏడాది మేడారం జాతరకు సుమారు రెండు కోట్ల మంది భక్తులు హాజరై వనదేవతలను దర్శించుకున్నారు. తల్లులు గద్దెపైకి చేరడంతో ఎక్కువ మంది భక్తులు సమ్మక్క–సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం జాతర ముగిసినప్పటికీ భక్తులు తిరుగువారం వరకు మొక్కులు చెల్లించుకుంటారు. చివరి రోజైన శనివారం పలువురు రాజకీయ ప్రముఖులు వనదేవతలను దర్శించుకున్నారు. వనప్రవేశం పూర్తయినా భక్తుల రద్దీ కొనసాగుతుంది. నేడు రాత్రి వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారు. మరోవైపు 4వేల మంది పారిశుధ్య సిబ్బంది విధుల్లో ఉన్నారు. మేడారం జాతర విజయవంతం కావడానికి సహకరించిన భక్తులు, అధికారులు, సిబ్బంది, మీడియాకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. విజయవంతం అవడంపై గవర్నర్, సీఎం హర్షం వ్యక్తం చేశారు.

# నా గౌరవానికి భంగం కలిగించారు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలంటూ జూబ్లీహిల్స్ ఏసీపీ జారీ చేసిన నోటీసులపై బీఆర్ఎస్ అధినేత, మాసీ సీఎం కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు.. సుదీర్ఘంగా రాసిన ఆరు పేజీల లేఖలో ఆయన పోలీసుల వైఖరిని ఎండగట్టారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ లోని తన నంది నగర్ నివాసం గోడపై నోటీసును అతికించడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక మాజీ ముఖ్యమంత్రి పట్ల ఇటువంటి చర్యలు రాజ్యాంగ విరుద్ధమని, తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అసలు జూబ్లీహిల్స్ ఏసీపీకి తనపై ఇలాంటి నోటీసులు జారీ చేసే అధికార పరిధి లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. తనకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదన్నారు. ఈనోటీసు ద్వారా తన గౌరవానికి భంగం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో కుటుంబ సభ్యులెవరూ లేని సమయంలో వచ్చి... గోడలకు నోటీసులు అంటించడం సరైన పద్ధతి కాదని హితవుపలికారు. చట్టంలోని నిబంధనలను ఉటంకిస్తూ కేసీఆర్ పోలీసుల తీరులోని లోపాలను వివరించారు. సీఆర్పీసీ సెక్షన్ 160 ప్రకారం, 65 ఏళ్లు పైబడిన వ్యక్తులను విచారించాల్సి వస్తే, అది వారి నివాసం వద్దే జరగాలని పార్లమెంట్ చట్టం చెబుతోందని ఆయన గుర్తు చేశారు. తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లి గ్రామమని, నిబంధనల ప్రకారం అక్కడే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పోలీసుల తీరుపై ఎన్ని అసహనాలు ఉన్నప్పటికీ, ప్రతిపక్ష నేతగా దర్యాప్తునకు తన వంతు సహకారం అందిస్తానని కేసీఆర్ ప్రకటించారు. నేడు మధ్యాహ్నం 3 గంటలకు తాను విచారణకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అయితే పోలీసులు అడిగినట్లు కాకుండా, తన నంది నగర్ నివాసంలోనే విచారణ జరపవచ్చని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో తనకు పంపే ఏవైనా నోటీసులు లేదా సమాచారం ఉంటే వాటిని తన ఎర్రవల్లి నివాసానికే పంపాలని పోలీసులకు సూచించారు. కాగా గతంలో హరీష్ రావు నోటీసుల విషయంలో పాటించిన పద్ధతులను, తన విషయంలో పోలీసులు పాటిస్తున్న వైఖరిని పోల్చి చూపిస్తూ.. పోలీస్ శాఖ 'డబుల్ స్టాండర్డ్స్' పాటిస్తోందని విమర్శించారు. ఎన్నికల అఫిడవిట్‌లో ఉన్న చిరునామాకు, ప్రస్తుతం తాను నివసిస్తున్న చోటికి మధ్య వ్యత్యాసాన్ని గమనించకుండా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు.

**సుప్రీం తీర్పు ప్రస్తావన**

ఈ లేఖలో కేసీఆర్ సుప్రీంకోర్టు తీర్పులను కూడా ప్రముఖంగా ప్రస్తావించారు. 'సతేందర్ కుమార్ అంతిల్ వర్సెస్ సీబీఐ' కేసు తీర్పు ప్రకారం, వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల్లో నోటీసులు పంపడం చట్టబద్ధం కాదని ఆయన వెల్లడించారు. పోలీసులు కావాలనే చట్టాలను ఉల్లంఘిస్తున్నారని, వారి చర్యలు ఆర్టికల్ 14, 21లకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. ఒకవేళ పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని ఆయన హెచ్చరించారు. అక్రమ పద్ధతిలో ఇచ్చిన ఈ నోటీసులను తాను విస్మరించవచ్చని, అయినప్పటికీ బాధ్యతాయుతమైన పౌరుడిగా తాను విచారణకు సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు.

# సమ్మక్క–సారలమ్మ ఆశీస్సులతో మేడారం మహాజాతర ఘనంగా ముగింపు

మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర ఈ ఏడాది అత్యం త ఘనంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తెలి పారు. కోట్లాది మంది భక్తులు ఎలాంటి అసౌకర్యాలు లేకుం డా తల్లులను దర్శించుకోవడం ప్రభుత్వ యంత్రాంగం సాధించిన ప్రధాన విజయమని ఆమె పేర్కొన్నారు.

ముందస్తుగా రూపొందించిన సమగ్ర ప్రణాళికలు, శాఖల మధ్య సమన్వయం, సమర్థవంతమైన భద్రతా ఏర్పాట్ల వల్ల జాతర ఎక్కడా అంతరాయం లేకుండా సాగిందన్నారు. రవాణా, వైద్య సేవలు, త్రాగునీరు, పారిశుధ్య సదుపాయాలు భక్తులకు మెరుగైన అనుభూతిని అందించాయని తెలిపారు.

నూతన అభివృద్ధి పనుల వల్ల మేడారం మహాజాతర ప్రతిష్ట మరింత పెరిగిందని, సంప్రదాయం–ఆధునిక సదుపాయాల సమన్వయం భక్తుల మనసును ఆకట్టుకుందని మంత్రి సీతక్క అన్నారు. సమ్మక్క–సారలమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు కలగాలని ఆమె ఆకాంక్షించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
01.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ప్రపంచంలో అధిక ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలు
2. సౌదీ అరేబియా
మధ్యప్రాచ్యంలో కీలక చమురు దేశం. ప్రపంచ చమురు మార్కెట్‌పై ప్రభావం చూపే స్థాయిలో నిల్వలు, ఉత్పత్తి సామర్థ్యం ఉంది.



# హైదరాబాదే ఆదర్శం

- **తెలంగాణ రైజింగ్ కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి**
- **హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ, ప్రస్తుత విద్యార్థులకు సీఎం పిలుపు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



దేశ భవిష్యత్తుకు తెలంగాణ రాష్ట్రం.., ప్రధానంగా హైదరాబాద్ నగరం ఆదర్శంగా నిలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. భారతదేశంతో అనుసంధానం పెంచుకొని పనిచేయాలని అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ, ప్రస్తుత విద్యార్థినీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. తమ ప్రతిభ, నైపుణ్యం, సంకల్పంతో తెలంగాణ రైజింగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని సూచించారు. సీఎం పిలుపుపై సానుకూలంగా స్పందించిన విద్యార్థులు తెలంగాణ అభివృద్ధి పథంలో తమ నైపుణ్యాన్ని, శక్తి సామర్థ్యాన్ని వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర గ్లోబల్ ప్రతిష్ఠను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నట్లు వివరించారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ లో లీడర్ షిప్ కోర్సు పూర్తి చేశారు. గత నెల 25 నుంచి 30 వరకు 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట నిర్వహించిన తరగతులకు హాజరైన ఆయన.... తన అధికారిక కార్యక్రమాల చివరి రోజు సందర్భంగా శనివారం యూనివర్సిటీలో వివిధ ప్రతినిధి బృందాలతో భేటీ అయ్యారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో పాటు, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కొలంబియా విశ్వవిద్యాలయం వంటి ప్రముఖ విద్యాసంస్థల విద్యార్థులు, అలుమ్నీలతోనూ సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ సమావేశాల్లో నాయకత్వం, విజయానికి సంబంధించిన అంశాలు, ఆర్థిక వృద్ధి, అభివృద్ధి నమూనాలు, సుస్థిరత, పర్యావరణ సవాళ్లు, రైతులు-మహిళలు-యువతకు సంక్షేమ విధానాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రాష్ట్రం ఎదుర్కొంటోన్న సవాళ్లతో పాటు తన దీర్ఘకాలిక విజన్ తెలంగాణ రైజింగ్ కోర్ పిల్లర్లను వారికి వివరించారు. సమగ్ర వృద్ధి, భాగస్వామ్య భాగస్వామ్యం (స్టేక్‌హోల్డర్ పార్టిసిపేషన్), శక్తి వంతీకరణ ఆధారిత అభివృద్ధికి ఈ విజన్ కల్పించే అవకాశాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఒక విద్యార్థుల బృందం తమకు నాయకత్వం గురించి బోధించాలని కోరగా అందుకు హార్వర్డ్ ప్రొఫెసర్లే ఉత్తములు అని ఈ విషయంలో తాను మోసపూరిత ప్రొఫెసర్ పాత్రను ధరించదలుచుకోలేదని సీఎం రేవంత్ సరదాగా వ్యాఖ్యానించారు.



# 'రెబెల్స్' లేకుండా చూడాలి

- **టికెట్లు రాని వారికి భవిష్యత్తులో ఇద్దాం**
- **పార్టీ ముఖ్యనేతలతో సీఎం రేవంత్ రెడ్డి**
- **అమెరికా నుంచి జూమ్ మీటింగ్ లో దిశానిర్దేశం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల కైవసమే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తున్నది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటిన హస్తం పార్టీ... ఈనెల 11న జరగనున్న పట్టణపోరులోనూ అలాంటి ఫలితాలే సాధించేలా వ్యూహాలకు పదునుపెడుతోంది. ఈ మేరకు అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి...శనివారం అక్కడి నుంచి సమీక్షా సమావేశం నిర్వహించారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్ ఏర్పాటు చేయగా అందులో సీఎం పాల్గొన్నారు. ఈ జూమ్ మీటింగ్‌లో జిల్లాల ఇన్ ఛార్జ్ మంత్రులు, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల నివేదికను మంత్రులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికలపై సీఎం మంత్రులకు కీలక సూచనలు చేశారు. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 90శాతం స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని టార్గెట్ నిర్దేశించారు. ఎక్కడా కూడా రెబల్స్ బెడద లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా రెబల్స్ బరిలో ఉంటే వారితో మాట్లాడాలని చెప్పారు. ఈ నెల 3న నామినేషన్లకు తుది గడువు ఉండటంతో ఆ లోపు వారితో విత్‌డ్రాలు చేయించాలని ఆదేశించారు. ఎక్కడ కూడా రెబల్స్ పోటీలో ఉండొద్దని దిశానిర్దేశం చేశారు. అలా ఉంటే పార్టీకి ప్రమాదమని హెచ్చరించారు. టికెట్లు రాని వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అందరికీ అండగా ఉంటుందని..నాయకులకు తగిన ప్రతిఫలం దక్కుందని చెప్పారు.



# దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

- **కేరళ లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

దివ్యాంగుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. కేరళకు చెందిన దివ్యాంగ చైల్డ్ ఉమెన్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన సభ్యులతో ఆయన శనివారం ప్రజాభవన్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. దివ్యాంగులు కూడా సమాజంలో భాగమేనని వారి అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. వైకల్యం దురదృష్టకరమే అయినా.. వారిని సమాజంలో అందరితో సమానంగా అభివృద్ధి చేసేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. కేరళలో కూడా వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి... ఆ ప్రభుత్వంలో అన్నివర్గాలతో సమానంగా దివ్యాంగులకు అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

# రోడ్డు భద్రతకు పటిష్ట చర్యలు

- **త్వరలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సర్టిఫికేషన్**
- **మంత్రి పొన్నం ప్రభాకర్**
- **అలియా ప్రభుత్వ పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన పార్క్ ప్రారంభం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతా, ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సర్టిఫికేషన్, ప్రతిజ్ఞ విధానాన్ని ట్రాన్స్‌పోర్ట్ శాఖ అమలు చేయనుందని చెప్పారు. గత నెల ఒకటి నుంచి రోడ్డు భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లోని ప్రభుత్వ అలియా మోడల్ హై స్కూల్‌లో ట్రాఫిక్ అవగాహన పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రోడ్డు భద్రత అందరి బాధ్యత అని అన్నారు. రోడ్డు ప్రమాదాలతో ప్రతిరోజూ సగటున 20 మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ భద్రతను పాఠశాల స్థాయి నుంచే ఒక సక్రమ విద్యా అంశంగా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.., రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 7వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాలకు రక్షణ కు తప్పక హెల్మెట్ వాడడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రోడ్ సేఫ్టీ మాసం సందర్భంగా 64 ప్రభుత్వ, 117 ప్రైవేట్ పాఠశాలలు కలిపి మొత్తం 181 పాఠశాలల్లో 24,648 మంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ.., ట్రాఫిక్ అవగాహన పార్క్ ఒక 'లివింగ్ క్లాస్‌రూమ్'లా పనిచేస్తుందని చెప్పారు. పుస్తకాలకే పరిమితం కాకుండా ఆటలు, అనుకరణల ద్వారా రోడ్డు సూచికలు, పాదచారి ప్రవర్తన, సైక్లింగ్ క్రమశిక్షణ, హెల్మెట్ భద్రత వంటి అంశాలను పిల్లలు ప్రాక్టికల్‌గా నేర్చుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) జోయెల్ డేవిస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు కుటుంబాలపై తీవ్ర దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయనీ ముఖ్యంగా కుటుంబ ఆదాయాధారం కోల్పోతే ఆర్థిక ఇబ్బందులు, పిల్లల విద్యలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యునిసెఫ్ ప్రతినిధులు డా. జెలాలెం, డా.శ్రీధర్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు రమేష్, చంద్రశేఖర్ గౌడ్, జిల్లా రవాణా అధికారి పురుషోత్తం రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి రోహిణి, కార్పొరేటర్ సురేఖ, రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్,హైదరాబాద్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు సురేష్, ట్రాన్స్‌పోర్ట్, విద్య, ట్రాఫిక్ పోలీస్ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు




# 'గ్రేటర్' బడ్జెట్

- **వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.11,460 కోట్లు కేటాయింపు**
- **ప్రకటించిన మేయర్ విజయలక్ష్మి**

**ముద్ర, హైదరాబాద్ :**

మహానగర అభివృద్ధే లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 202627 ఆర్థిక సంవత్సరానికి భారీ బడ్జెట్ ప్రవేశపెట్టింది. శనివారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో కమిటీ రూ.11,460 కోట్ల బడ్జెట్ ముసాయిదాకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గతేడాది బడ్జెట్ కంటే ఈసారి కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా విలీన మున్సిపాలిటీల అభివృద్ధి, రోడ్ల విస్తరణ, పారిశుధ్య నిర్వహణపై ఈ బడ్జెట్‌లో ప్రాధన్యతను ఇచ్చారు. పాత జీహెచ్ఎంసీ పరిధిలో మున్సిపాలిటీలకు రూ.9,200 కోట్లు, కొత్తగా విలీనం అయిన 27 మున్సిపాలిటీలకు రూ.2,260 కోట్లు కేటాయించారు. ఇందులో నగరంలో పెరిగిన ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, కొత్త ఫ్లైఓవర్లు, రోడ్ల నిర్వహణ కోసం రూ.1,720 కోట్లు ఖర్చు చేయనున్నారు. నగరంలో పచ్చదనాన్ని పెంచేందుకు రూ.590 కోట్లతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. భారీ వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లో సమస్య తలెత్తకుండా స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్లాన్ కింద రూ.550 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌కు కేటాయించిన మొత్తం సొమ్మును ఆస్తి పన్ను, టౌన్ ప్లానింగ్ ఫీజులు, ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా సమకూర్చనున్నారు.

# తనిఖీలకు కాస్త బ్రేక్

- **అవగాహన కల్పించాకే తిరిగి ప్రారంభం**
- **వ్యాపార సంఘాలతో హైడ్రా సమావేశం**
- **సరిచేసుకోకపోతే కఠిన చర్యలు**

**ముద్ర, హైదరాబాద్:**



ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని షాపుల సీజ్ చేసే కార్యక్రమానికి నెల రోజులు హైడ్రా విరమాం ఇచ్చింది. ఈ నెల రోజుల గడువులో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా షాపులు, వ్యాపార సముదాయాల వారు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని హైడ్రా నిర్ణయించింది. నెల తర్వాత తనిఖీలు ముమ్మరం చేసి నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. ఈ మేరకు షాపుల యజమానులు, వ్యాపార సంఘాల ప్రతినిధులతో పాటు హైడ్రా, జీహెచ్ ఎంసీ, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులతో శనివారం హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ సమావేశమై నిబంధనలను వివరించారు. నెల రోజులు గడువు కావాలని పలు వ్యాపార సంఘాలు, దుకాణదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని స్వీకరించారు. 9 షాపుల నుంచి అఫిడవిట్లు తీసుకున్నాక వ్యాపారాలకు అనుమతివ్వాలని సమావేశం నిర్ణయించింది.

**అవగాహన కార్యక్రమాలు**

పాతబస్తీ, బేగంబజార్, ట్రూప్ బజార్, మదీన సెంటర్ ఇలా ముఖ్యమైన వ్యాపార సముదాయాలున్న ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించి అందిరిలో చైతన్యం తీసుకు వస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఒక వేళ అగ్ని ప్రమాదం జరిగితే అందులో ఉన్న వారు సులభంగా బయటకు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**సెల్లార్లను గోదాంలు చేయవద్దు..**

సెల్లార్లను ఆయా షాపుల వారు గోదాములుగా మార్చవద్దని హైడ్రా కమిషనర్ సూచించారు. పై అంతస్తుల్లో ప్రమాదం జరిగినా కిందకు దిగి వెళ్లడానికి వీలుంటుందని.. సెల్లార్లలోనే ప్రమాదం జరిగితే అగ్గిలో దూకే పరిస్థితి ఎదురౌతుందని హెచ్చరించారు. సెల్లార్లను వాహనాల పార్కింగ్ కోసమే వినియోగిస్తే ట్రాఫిక్ జామ్లు తగ్గడంతో పాటు.. కొనుగోలుదారులకు ఎంతో ఊరటగా ఉంటుందన్నారు.

**నిబంధనలు**

అకస్మాత్తుగా మంటలు వ్యాపిస్తే వాటర్ స్ప్రింక్లర్లు ఉండాలి. స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు ఉండడమే కాదు.. వాటి నిర్వహణ సరిగా ఉండాలి.

**- నాణ్యమైన విద్యుత్ వైర్లనే వినియోగించాలి.**

పవర్ సప్లైతో పాటు సరఫరా ప్యానెల్స్ ఏర్పాటు చేసిన చోట ఒక వేళ నిప్పు రవ్వలు పడినా మంటలు వ్యాపించకుండా కింది భాగంలో కంకరతో చాంబర్లు ఏర్పాటు చేయాలి.

విద్యుత్ లైట్లు, వైర్లకు చేరువలో వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కింద వ్యాపారాలు, పై అంతస్తుల్లో నివాసాలున్న చోట మరింత అప్రమత్తంగా ఉండాలి.

ఎలక్ట్రానిక్ ఛార్జింగ్ పాయింట్లు పెట్టినప్పుడు, ఏసీలు వినియోగిస్తున్నప్పుడు విద్యుత్ వినియోగం పెరుగుతుందని.. ఆ విధంగా సామర్థ్యాన్ని పెంచుకోవాలి.

మదీన, బేగంబజార్ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక వాహనం వెళ్లే విధంగా అక్కడి స్థానికులు జాగ్రత్తలు తీసుకోవాలి.

సెల్లార్లలో వాచ్మ్యాన్ల కుటుంబాల నివాసాలుండకూడదు. వంటలకు సంబంధించి క్యాంటిన్లు పెట్టరాదు.



# శిల్పారామంలో ముగిసిన 'గాంధీ శిల్ప బజార్'

**ముద్ర, శేరిలింగంపల్లి :**

మాదాపూర్ శిల్పారామంలో నిర్వహించిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర హస్తకళా ఉత్సవం 'గాంధీ శిల్ప బజార్' ఆదివారంతో ఘనంగా ముగిసింది. పది రోజులుగా కొనసాగిన ఈ మేళాకు సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హస్తకళాకారులను ప్రోత్సహించారు. ఈ బజార్‌లో ట్రైబల్ కళాకారుల తయారు చేసిన బస్తర్ మెటల్ క్రాఫ్ట్, మెటల్ జ్యువెలరీ, గృహోపకరణాలు, చీరలు, డ్రస్ మెటీరియల్స్ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉంచారు. ముగింపు కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్ విన్నీలరావు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రామాయణ శబ్దం, ధనశ్రీ తిల్లాన, భో శంభో, జతిస్వరం, రాజరాజేశ్వరి, బృందావన నిలయే, బ్రహ్మాంజలి, కొలువైతివారంగా సాయి, ఒకపరి కొకపరి, చందన చర్చిత, ప్రహ్లాద పట్టాభిషేకం, అతి నిరుపమా, శివ తాండవం వంటి అంశాలను గాయత్రీ, రాణీత, అనన్య, హంసిక, లక్ష్మి ప్రసన్న, ఆరాధ్య, గీతిక, యోషా, పూర్విక, అక్షర, వివేక, శివాని తదితరులు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 01.02.2026
www.mudranews.in
@mudranews
mudratv

4 వేదిక Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమస్ఫూర్తి రగిలించిన నేల ఇది.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొల్పండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## వారసుడు వద్దు..

# వారసురాలే కావాలి..



ఒకప్పుడు ఇంటికి దీపం ఇల్లాలు అన్నారు కానీ వంశానికి దీపం కొడుకే అని భావించేవారు. కాలచక్రం తిరిగింది.. ఆలోచనల ధోరణి మారింది. నేడు "వంశోద్ధారకుడు" అనే పాతచింతకాయ పచ్చడి ఆలోచనల కంటే కన్నవారి కళ్లలో ఆనందాన్ని చూసే "అమ్మాయి" వైపే ప్రపంచం మొగ్గు చూపుతోంది.

సంతానం విషయంలో తల్లిదండ్రుల ప్రాధాన్యతలు మారుతున్న తీరుపై ఇటీవల వెలువడిన అధ్యయనాలు సామాజిక చైతన్యానికి నిదర్శనం.

ఇంతకాలం భారతీయ సమాజంలో ఒక నమ్మకం బలంగా ఏర్పడింది... ఇంటికి వెలుగు రావాలంటే కొడుకు పుట్టాలి, వంశానికి పేరు నిలవాలంటే వారసుడు కావాలి అని. ఆడపిల్ల పుట్టడాన్ని సహజంగానే చూసినా, కొడుకుతో పోలిస్తే తక్కువ ప్రాధాన్యం ఇచ్చే పరిస్థితులు ఎన్నో కనిపించేవి. కానీ కాలం మారింది. ఆలోచనలు మారుతున్నాయి. నేటి తల్లిదండ్రుల మనసుల్లో ఒక కొత్త భావన బలపడుతోంది.. వారసుడి కోసం కాదు... వారసురాలే కావాలనే ఆలోచన. ప్రేమ, అనుబంధం, బాధ్యత, భద్రత.. ఈ నాలుగు మాటలే ఇప్పుడు అమ్మాయిలకు పెరుగుతున్న ఆదరణకు కారణాలుగా మారాయి.

### ఆప్యాయతకు చిరునామా.. అమ్మాయి

అబ్బాయిల కంటే అమ్మాయిలే తల్లిదండ్రుల పట్ల ఎక్కువ బాధ్యతగా భావోద్వేగ అనుబంధాన్ని కలిగి ఉంటున్నారని గణాంకాలు చెబుతున్నాయి. తల్లిదండ్రుల ఆరోగ్యం క్షీణించినా మనసు బాగోకపోయినా వారు ఇచ్చే భరోసా వెలకట్టలేనిది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను భారంగా భావించే ఈ రోజుల్లో 'ఆడపిల్ల అండ' ఒక కొండంత ధైర్యాన్ని ఇస్తోంది. పెళ్లై అత్తారింటికి వెళ్లినా పుట్టింటి కష్టసుఖాలను తన భుజాలపై వేసుకునే తత్వం ఆడపిల్లలకే సొంతం.

### సవాళ్లు.. సామర్థ్యాలు

మరోవైపు నేటి సమాజంలో యువత ముఖ్యంగా అబ్బాయిలు తప్పుదారి పట్టే అవకాశాలు ఎక్కువగా ఉండటం తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. కానీ అమ్మాయిలు మాత్రం ప్రతికూల పరిస్థితులను ఎదురిస్తూ విద్య, ఉపాధి రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తున్నారు. "ఆడపిల్ల అంటే ఖర్చు" అనే ఆలోచన పోయి "ఆడపిల్ల అంటే ఒక భరోసా" అనే నమ్మకం ఏర్పడింది.

సమాజంలో లింగ వివక్ష తగ్గుముఖం పట్టడం శుభపరిణామం. అయితే ఈ మార్పు కేవలం ఒకరిని తక్కువ చేసి మరొకరిని ఎక్కువ చేయడం కోసం కాదు. పిల్లలు ఎవరైనా వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడమే ముఖ్యం. అయినప్పటికీ దశాబ్దాల తరబడి అణచివేతకు గురైన 'ఆడపిల్ల'కు నేడు సమాజం ఇస్తున్న ఈ గౌరవం, ప్రాధాన్యత నిజంగా ఒక విప్లవాత్మక మార్పే. వారసత్వం అంటే కేవలం ఇంటి పేరును ముందుకు తీసుకెళ్లడం కాదు, తల్లిదండ్రుల ప్రేమను, సంస్కారాన్ని నిలబెట్టడమని నేటి 'వారసురాళ్లు' నిరూపిస్తున్నారు.

# భీమా రంగంలో ప్రైవేటీకరణ తగదు



వివిధ ఊహించని సంఘటనల వలన జరగరాని ప్రమాదం జరిగినప్పుడు ఒక వ్యక్తి అనుకోకుండా మరణిస్తే,అది కుటుంబం పై ఆర్థిక భారం కు దారితీయవచ్చు.ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి కొంత ఆర్థిక భద్రత కలిగించడం భీమా యొక్క ముఖ్య ఉద్దేశం. ఎవరైనా జీవిత బీమా పాలసీని తీసుకోవచ్చు.ఒక వ్యక్తి రూ. 10 లక్షలకు జీవిత బీమా పాలసీ తీసుకున్నప్పుడు, అతను లేదా ఆమె ప్రతి నెలా కొన్ని వేల రూపాయల వంటి నిర్ణీత మొత్తాన్ని క్రమం తప్పకుండా చెల్లించడానికి అంగీకరిస్తారు. దీనిని పాలసీ ప్రీమియం అంటారు.దీనిని ఏడు సంవత్సరాల వంటి నిర్దిష్ట కాలానికి చెల్లించాల్సి ఉంటుంది. దీనికి బదులుగా పాలసీదారుడు మరణించినట్లయితే బీమా కంపెనీ నామినేట్ చేయబడిన కుటుంబ సభ్యునికి రూ. 10 లక్షలు చెల్లిస్తానని వాగ్దానం చేస్తుంది. అదేవిధంగా ఆసుపత్రిలో చేరడం, మోటారు ప్రమాదం,ఇంట్లో అగ్నిప్రమాదం, దొంగతనం వంటి ప్రమాదాలను కవర్ చేయడానికి కూడా బీమా పాలసీలను తీసుకోవచ్చు.మన దేశంలో స్వాతంత్ర్యం రాక ముందు జనాభాలో చాలా తక్కువ మందికి సేవలు అందించే పెద్ద సంఖ్యలో ప్రైవేట్ బీమా కంపెనీలు ఉండేవి. భారతదేశంలో మొట్టమొదటి జీవిత బీమా సంస్థ ఓరియంటల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, దీనిని 1818లో కలకత్తాలో (ఇప్పుడు కోల్‌కతా) స్థాపించారు.అయితే ఇది ప్రధానంగా యూరోపియన్లకు సేవలందించింది. భారతీయ యాజమాన్యంలోని మొదటి జీవిత బీమా సంస్థ బాంబే మ్యూచువల్ లైఫ్ అస్యూరెన్స్ సొసైటీఇది 1870లో స్థాపించబడింది.

1956లో 240కి పైగా ప్రైవేట్ కంపెనీలను విలీనం చేసి, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనే ఒకే ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థను ఏర్పాటు చేశారు.జీవిత భీమా కాని పాలసీలను అందించే కంపెనీలను 1972లో జాతీయం చేసి జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారు.పాలసీదారుల సంఖ్య పెరిగే కొద్దీ వసూలు చేసిన ప్రీమియంలు చెల్లించిన డబ్బు కంటే ఎక్కువగా ఉంటాయి, దీనివల్ల ఒక భీమా నిధి పేరుకుపోతుంది.ఈ నిధిని ఎల్ఐసి,జిఐసి సంస్థలు స్థిర వడ్డీ రేట్లపై దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వానికి రుణాలు ఇవ్వడానికి ఉపయోగించాయి.1993 నుండి సరళీకృత ప్రైవేటీకరణ వలన బీమా పాలసీల అందించే రంగాన్ని ప్రైవేట్ కంపెనీల కోసం ఇండియన్ ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ 1999లో స్థాపించబడింది.ప్రైవేట్ యాజమాన్యంలోని భీమా కంపెనీలు చాలా అధిక స్థాయిలో ప్రీమియంలను వసూలు చేసి భారీ నిధిని ఏర్పాటు చేసుకొని వారు ఈ నిధిని డబ్బు అప్పుగా ఇవ్వడం, ప్రైవేట్ కంపెనీల షేర్లను కొనడం,అమ్మడం, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి జరుగుతుంది.

భీమా కంపెనీలు పాలసీదారులకు అధిక రాబడులను వాగ్దానం చేస్తూ, "యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీలను" (యూలిప్‌లను) ప్రాచుర్యంలోకి తెచ్చాయి.అయితే బీమా కంపెనీ పెట్టుబడులలో నష్టం వాటిల్లితే యూలిప్ పాలసీలు ఉన్నవారు డబ్బును కోల్పోయే ప్రమాదం ఉంది.బీమా చట్టాల (సవరణ) చట్టం 2025 డిసెంబర్‌లో పార్లమెంటుచే ఆమోదించబడింది. ఈ చట్ట మార్పులలో ప్రధానమైనది ఏమిటంటే భీమా నిధులను నిర్వహించే కంపెనీలలో విదేశీ యాజమాన్య వాటాను 74% నుండి 100%కి పెంచడం.భీమా రంగంలో ప్రైవేట్ విదేశీ పెట్టుబడుల వలన భీమా పాలసీదారులకు భద్రత కరువయ్యే ప్రమాదం పొంచి ఉందని గ్రహించాలి.



– ఆళవందార్ వేణు మాధవ్
ప్రధాన కార్యదర్శి,
సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్
8686051752,హైదరాబాద్

# కళ్లే చెబుతున్నాయి... మన ఆరోగ్య నిజాలు

**అవును, మీ కళ్ళు మీ మొత్తం ఆరోగ్యం గురించి చాలా విషయాలు చెబుతాయి; మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, స్ట్రోక్, కొన్ని రకాల క్యాన్సర్‌లు వంటి తీవ్రమైన వ్యాధులకు సంకేతాలు కంటి పరీక్షల్లో కనిపిస్తాయి, ఎందుకంటే కళ్ళలోని రక్త నాళాలు శరీరంలోని ఇతర భాగాలలోని రక్త నాళాలను ప్రతిబింబిస్తాయి. కళ్ళలో ఎరుపు, పొడిబారడం, అస్పష్టమైన దృష్టి, కంటి రెప్పలు అడటం వంటివి ఒత్తిడి, అలసట, అలర్జీలు లేదా అంతర్గత ఆరోగ్య సమస్యలకు సూచనలు కావచ్చు. ముఖం చూసి ఆ మనిషి మూడ్ ఏంటో చెప్పేస్తాం. అలాగే కళ్లు కూడా మన గురించి ఎన్నో విషయాలు చెబుతాయి. కళ్లు నవ రసాలను పలికించటమే కాదు.. మన దేహంలో సూక్ష్మ స్థాయిలో దాగున్న జబ్బుల జాడల్ని కూడా సూక్ష్మంగా అందించగలవట. మన కళ్లలోకి చూసి మన గుండె ఆరోగ్యాన్ని చెప్పేయొచ్చు. మీ కళ్ళు మృదువుగా ఎలాంటి మచ్చలు లేకుండా స్పష్టంగా మెరుస్తున్నాయంటే మీ శరీరంలో ఆరోగ్య సమస్యలు తక్కువని అర్థం. శరీరంలో రక్త ప్రసరణ బాగా జరిగితే అన్ని అవయవాలకు సరిపడా ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. అందుకే కళ్ళు ప్రకాశవంతంగా కనిపిస్తాయి. కళ్ళు ఆరోగ్యంగా ఉంటే మీ మొత్తం ఆరోగ్యం బాగున్నట్లే లెక్క.**

### కనుపాప

కనుపాప వెలుతురుకు తక్షణమే స్పందిస్తుంది. ప్రకాశవంతమైన వాతావరణంలో కనుపాప చిన్నదవుతుంది. వెలుతురు తగ్గే కొద్దీ కనుపాప పెద్దదవుతుంది.

ఈ కనుపాప పరిమాణం హెచ్చుతగ్గుల ప్రతిస్పందన నెమ్మదిగానో, ఆలస్యంగానో జరుగుతున్నట్లయితే అది పలు అనారోగ్యాలను సూచిస్తుంది. అందులో అల్జీమర్స్ వంటి వ్యాధులు, మందుల ప్రభావాలు, మాదకద్రవ్యాల వినియోగించారనే దానికి ఆధారాల వంటివి ఉంటాయి.

కొకెయిన్ వంటి మాదకద్రవ్యాలను ఉపయోగించే వారిలో కనుపాపలు ఉబ్బి కనిపిస్తాయి. హెరాయిన్ వాడేవారిలో కనుపాపలు చాలా చిన్నవిగా కనిపిస్తాయి.

కళ్లు ఎరుపు రంగులోకి, రక్తంతో ఎరుపెక్కిన రంగులో కనిపిస్తే.. అది అధికమోతాదులో మద్యం లేదా, మాదకద్రవ్యాలను తీసుకున్నదానికి సంకేతం కావచ్చు. కళ్లలో నలత లేదా ఇన్ఫెక్షన్ కారణంగా కూడా కళ్లు ఎర్రగా మారవచ్చు. అయితే ఈ సమస్య చాలా వరకూ రోజుల్లోనే తగ్గిపోతుంది.

ఒకవేళ కళ్లు ఇలా రంగి మారి ఎక్కువ కాలం అలాగే ఉంటే మరింత తీవ్రమైన ఇన్ఫెక్షన్, వాపు, లేదా కాంటాక్ట్ లెన్సులు, సొల్యూషన్లకు రియాక్షన్‌ను అది సూచించవచ్చు.

మరీ తీవ్రమైన కేసుల్లో ఎరుపు కళ్లు గ్లుకోమాకు సూచనకావచ్చు. ఈ జబ్బు అంధత్వానికి దారితీయగలదు. ఇక తెల్లగుడ్డు పసుపు రంగులోకి మారితే అది జాండిస్ (కామెర్లు) జబ్బుకు గుర్తు. కాలేయానికి జబ్బు సోకిందని చిహ్నం.

కామెర్లు సోకటానికి కారణాలు చాలా ఉంటాయి. కాలేయం వాపు (హెపటైటిస్), జన్యుపరమైన లేదా ఆటోఇమ్యూన్ జబ్బులు, కొన్ని రకాల మందులు, వైరస్‌లు, ట్యూమర్లు వంటి వాటివల్ల ఈ జబ్బు రావచ్చు.

### కంటిలో ఎరుపు చార

కంటి తెల్లగుడ్డు మీద ఒక ఎర్రని, రక్తపు చార వంటి గుర్తు కనిపించిందంటే.. అది అక్కడి ఒక చిన్న రక్త నాళం చిట్లిందని అర్థం. ఈ పరిస్థితికి చాలా సందర్భాల్లో కారణాలు తెలియవు. కొన్ని రోజుల్లోనే ఆ చార కనిపించకుండా పోతుంది.

అయితే.. అధిక రక్తపోటుకు లేదా మధుమేహానికి సూచిక కావచ్చు. అంతేకాదు, రక్త సరఫరాలో గడ్డలు కట్టి అడ్డంకులు ఏర్పడి అధిక రక్తస్రావానికి దారితీయగల ప్రమాదానికి ఈ రక్త చారిక సంకేతం కావచ్చు.

రక్తం పలుచబారటానికి వాడే ఆస్పిరిన్ వంటి మందులు కూడా ఈ చారకు కారణం కావచ్చు. ఈ సమస్య తరచుగా వస్తున్నట్లయితే తమకు ఇస్తున్న మందుల మోతాదునీ



సమీక్షించాల్సిందిగా మి వ్యక్తి గత వైద్యులకీ తెలియపరచి తనకు చికిత్సను కోరవచ్చు.

### నల్లగుడ్డు చుట్టూ వలయం

కంటిలో నల్లగుడ్డు (శుక్ల పటలం) చుట్టూ తెల్లటి లేదా బూడిద రంగు వలయం కనిపిస్తే అది తరచుగా.. అధిక కొవ్వుకు చిహ్నంగా, గుండె జబ్బు ప్రమాదం ఎక్కువ ఉన్నదని చెప్పే సంకేతంగా పరిగణిస్తాము.

ఈ వలయం మద్యపాన వ్యసనాన్ని కూడా వెల్లడించవచ్చు. అలాగే వయోవృద్ధుల కళ్లలో కూడా ఈ వలయాలు కనిపిస్తుంటాయి. అందుకే దీనికి వైద్య పరిభాషలో ఆర్కస్ సెనిలిస్ అని పేరు .

### కంటిలో గడ్డ

కంటి తెల్లగుడ్డు మీద కనిపించే పసుపురంగు గడ్డను పింగుకులా అంటారు. ఇది సాధారణంగా నిరపాయకరం, చుక్కల మందులతో లేదా చిన్న శస్త్రచికిత్సతో తొలగించవచ్చు. అయితే నిర్లక్ష్యం చేస్తే, ఇది నల్లగుడ్డు మీదకి పెరిగి పెట్రీజియంగా మారి చూపును మసకబార్చే ప్రమాదం ఉంది. సూర్యుడి అతినీలలోహిత కిరణాలు దీనికి ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. కాబట్టి కంటిలో గడ్డ కనిపిస్తే వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలి.

### ఉబ్బిన కళ్లు

కళ్లు బయటకు పొడుచుకువచ్చినట్లు ఉబ్బుగా ఉండటం మామూలు ముఖాకృతిలో భాగంగా ఉండవచ్చు.

కానీ, మామూలుగా ఉబ్బెత్తు కళ్లు లేని వారికి.. కళ్లు ఉబ్బుతూ బయటకు పొంగుతున్నట్లుగా రావటం మొదలైతే.. అందుకు థైరాయిడ్ గ్రంథి సమస్య కారణం కావచ్చు. దీనికి వైద్య సాయం అవసరం.

ఒకటే కన్ను బయటకు పొడుచుకువచ్చినట్లు అయితే.. దానికి కారణం ఏదైనా గాయం కానీ, ఇన్ఫెక్షన్ కానీ కావచ్చు. అరుదైన కేసుల్లో కంటి వెనుక ట్యూమర్ (గడ్డ) ఏర్పడటం కూడా కారణం కావచ్చు.

### రెప్పల మీద కురుపులు

కళ్లే కాదు, కనురెప్పలు కూడా చాలా అనారోగ్యాల గురించి సూచిస్తుంటాయి. ఇవి ప్రధానంగా కనురెప్పల గ్రంథులకు సంబంధించిన చిన్నపాటి అనారోగ్యాలు.

కనురెప్పల్లో తరచుగా కనిపించే సమస్య స్టై లేదా చలాజియాన్. ఎక్కువగా పై కనురెప్ప మీద.. అరుదుగా కింది కనురెప్ప మీద ఒక ఎర్రటి గడ్డ ఏర్పడుతుంది. నూనె గ్రంథికి అడ్డంకులు తలెత్తటం వల్ల ఈ కురుపులు పుట్టుకొస్తాయి.స్టై లేదా చలాజియన్ అని పిలిచే ఈ కనురెప్పల కురుపులు మామూలుగా వాటికవే తగ్గిపోతాయి. లేదంటే వెచ్చటి కాపడం పెట్టటం ద్వారా తగ్గుతాయి. ఒకవేళ అలా తగ్గకుండా ఎక్కువ కాలం కొనసాగితే దీనిని చిన్నపాటి శస్త్రచికిత్సతో తొలగించాలి.

### కళ్లు అదరటం

ఇక కనురెప్పలు అదరటం (ఆక్యులార్ మయోకిమియా) చాలా తరచుగా జరుగుతుంటుంది. దీనికి ఇరిటేషన్, శరీరంలో వేడి సెగలు (హాట్ ఫ్లాషెస్) కారణం కావచ్చు. ఒక్కోసారి ఇవి కనిపించే దానికన్నా చాలా తీవ్రంగా ఉన్నట్లు అనిపిస్తుంటాయి. ఈ కళ్లు లేదా కనురెప్పలు అదరటం అనే ఈ పరిస్థితి చాలా వరకూ ఒత్తిడి వల్ల కానీ పోషకాహార సంతులనం లోపించటం వల్ల కానీ, అధిక మోతాదులో కెఫీన్ సేవించటం వల్ల కానీ తలెత్తే నిరపాయమైన సమస్య.

★ ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ వంటి అధునాతన కంటి స్కాన్‌లు రెటీనా రక్త నాళాలలో జరిగే చిన్న మార్పులను కూడా సులభంగా గుర్తించగలవు. ఈ స్కాన్‌లు రెటీనాలో అధిక రక్తపోటు, రక్తం గడ్డకట్టడం లేదా రక్త ప్రవాహానికి ఆటంకం కలిగించే ఫలకాలు వంటి పరిస్థితులను వెల్లడిస్తాయి. ఇవన్నీ అధిక రక్తపోటు, అథెరోస్క్లెరోసిస్ లేదా స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతాయని సూచిస్తున్నాయి. కొన్నిసార్లు కంటికి రక్త ప్రవాహం తాత్కాలికంగా ఆగిపోయినప్పుడు, రెటీనాపై చిన్న మచ్చలు ఏర్పడతాయి. దీనిని ఐ స్ట్రోక్ అంటారు. ఇది గుండె జబ్బులు లేదా అధిక రక్తపోటు సంభావ్యతను తెలియజేస్తుంది.

★ OCT స్కాన్‌లు కేవలం కంటి ఆరోగ్యానికి మాత్రమే కాకుండా గుండె జబ్బులు లేదా నరాల దెబ్బతినడానికి దారితీసే రక్త నాళాలలో ముందస్తు మార్పులను తెలుసుకోవడానికి కూడా సహాయపడతాయి. ఈ సంకేతాలను ముందుగా గుర్తిస్తే, జీవనశైలి మార్పులు లేదా మందులతో తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు.

### 'కళ్లు పొడిబారడం'

★ రకరకాల కారణాలతో కళ్లపై ఉండే టియర్ ఫిల్మ్ ప్రభావితం కావడం వల్ల కళ్లు పొడిబారతాయి. మూడు పొరలతో టియర్ ఫిల్మ్ ఏర్పడుతుంది. టియర్ ఫిల్మ్‌లో లిపిడ్ లేయర్ (నూనె), ఆక్వాస్ లేయర్ (నీరు), మ్యూకర్ లేయర్ ఉంటాయి.

★ టియర్ ఫిల్మ్‌లోని ఈ మూడు పొరల కలయిక కళ్లను శుభ్రంగా, తడిగా ఉంచుతుంది.

ఈ మూడు పొరల్లో దేనిలోనైనా మార్పులు వస్తే కళ్లు పొడిబారతాయి.ఇది తీవ్రమైన సమస్య ఏమీ కాదు, కానీ చాలా ఇబ్బంది పెడుతుంది.

### కన్నీళ్లు

★చికాకుకు వ్యతిరేకంగా రక్షణ మీరు ఉల్లిపాయలు కోసినపుడు మీ కంటి నుండి నీరు ఎందుకు వస్తుందో ఆలోచించారా? ఉల్లిపాయ మీ కళ్ళను చికాకు తెప్పించే కొన్ని ఎంజైమ్ లను కలిగి ఉంటుంది. అదేవిధంగా దుమ్ము కణాలు మీ కళ్ళలోకి ప్రవేశించినపుడు కూడా కన్ను నుండి నీరు బయటకు వస్తుంది. ఈవిధంగా ఏడవటం వలన కన్నీటి ద్వారా దుమ్ము కణాలు బయటకు పోతాయి...



డా.కౌశల్ గోవర్ధన
ఏం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్,
డా.ధనుంజయ హాస్పిటల్,
హైదారాబాద్

### మీ మొత్తం ఆరోగ్యం కోసం..

మానసిక కారణాల వలన విడుదలైన కన్నీళ్లలో 24 శాతం ఎక్కువ అల్బుమిన్ ప్రోటీన్ ఉండుట వలన శరీరం యొక్క జీవక్రియ వ్యవస్థను క్రమబద్ధీకరించటానికి సహాయపడుతుంది. ఏడుపు అధిక ఒత్తిడి స్థాయిల వలన కలిగే అధిక రక్తపోటు,స్థూలకాయం మరియు మధుమేహం వంటి వ్యాధుల పోరాడటానికి సహాయపడుతుంది.

### పచ్చని ఆకుకూరలు, కూరగాయలతో కళ్ల ఆరోగ్యం మెరుగు పడుతుంది

ఆకుకూరలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి పోషకాల గని అని చెప్పొచ్చు. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఆకుకూరలు మన శరీరానికి రోగనిరోధక శక్తిని అందించి, అనేక వ్యాధుల బారి నుండి కాపాడతాయి. గుండె ఆరోగ్యం నుండి ఎముకల బలం వరకు, జీర్ణక్రియ మెరుగుదల నుండి కంటి చూపు వరకు, ఆకుకూరలు అందించే ప్రయోజనాలు అపారం.

కళ్ళు ఆరోగ్యంగా ఉండటం కోసం ఎటువంటి ఆహారాలు తినడం మంచిది అన్నది చూస్తే, కళ్ళు ఆరోగ్యంగా ఉండాలంటే ఆకు కూరలు తినడం ఎంతో మంచిది . పచ్చి కూరగాయలు ఎక్కువగా తినడం వల్ల కూడా కళ్ళు ఆరోగ్యంగా ఉంటాయి.. పచ్చి కూరగాయలలో కరెటోనాయిడ్స్ చాలా ఎక్కువగా ఉండటం వల్ల ఇవి కళ్ళకు మేలు చేస్తాయి.. యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించి, దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, గుండె జబ్బులు మరియు వయస్సు సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి...

★ **మధుమేహం :** అస్పష్టమైన దృష్టి, రెటీనాలో మార్పులు మధుమేహానికి సంకేతాలు కావచ్చు.
★ **అధిక రక్తపోటు :** రక్తనాళాలలో మార్పులు అధిక రక్తపోటును సూచిస్తాయి.
★ **గుండె జబ్బులు :** కంటి పరీక్ష సమయంలో రక్తనాళాల స్థితిని బట్టి గుండె జబ్బుల సంకేతాలను చూడవచ్చు.
★ **ఆటో ఇమ్యూన్ వ్యాధులు :** రుమటాయిడ్ ఆర్థరైటిస్, లూపస్ వంటి వ్యాధులు కళ్ళలో మంట, వాపు, పొడిబారడం వంటివి కలిగిస్తాయి.
★ **థైరాయిడ్ సమస్యలు :** ఉబ్బిన కళ్ళు, కనురెప్పల సంకోచం థైరాయిడ్ వ్యాధికి సంకేతాలు కావచ్చు.
★ **రక్తహీనత :** రక్తహీనత వల్ల కళ్ళు పాలిపోయినట్లు కనిపించవచ్చు.

**మనం ఎప్పుడూ కంటి వైద్యుని సంప్రదించాలి, ఎలా పరీక్ష చేయించుకోవాలి..? కొన్ని సందర్భాల్లో, కంటి పరీక్ష ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడగలదు, ఎందుకంటే ఇది తీవ్రమైన వ్యాధిని ముందుగానే గుర్తించడంలో సహాయపడుతుంది.**

### మీకు తెలుసా?

### భూత్ బంగ్లాల రహస్యం?

**చాలా "భూత్ బంగ్లాలు"లో కార్బన్ మోనాక్సైడ్ లేదా ఇతర విష వాయువులు అధికంగా ఉన్నాయని పరిశోధనల్లో బయటపడింది. ఇవి భ్రమలు, తలనొప్పి, విచిత్ర అనుభూతులను కలిగిస్తాయి. అందుకే పాత ఇళ్లలోకి వెళ్లినప్పుడు లోపభూయిష్టమైన పరికరాల వల్ల భూతబంగ్లాల్లా అనిపిస్తుంది. కొన్ని సార్లు శాస్త్రం భూతాల రహస్యాన్ని ఛేదిస్తుంది అంటే ఇదే కాబోలు.. అందులో దెయ్యాలు.. భూతాలు ఉన్నాయన్నవి మన భ్రమనే..**



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





ప్రపంచంలో అధిక ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలు
3. కెనడా
ఆయిల్ సాండ్స్ రూపంలో భారీ చమురు నిల్వలు ఉన్నాయి. సాంకేతిక వ్యయం ఎక్కువగా ఉండటంతో ఉత్పత్తి ఖరీదైనది.

# ఎన్నికల నిబంధనలు కఠినంగా అమలు చేయాలి

**ఎస్పీ స్నేహ మిశ్రా**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**




మునిసిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీస్ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని ఎస్పీ స్నేహ మిశ్రా స్పష్టం చేశారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఆన్లైన్ ఓరియంటేషన్ సమావేశంలో ఆమె జిల్లా పోలీస్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి అధికారి ఎన్నికల నియమావళిని తు.చ. తప్పకుండా పాటించాలని ఎస్పీ ఆదేశించారు. క్షేత్రస్థాయిలోని ప్రతి పోలింగ్ బూత్‌ను దృష్టిలో ఉంచుకుని అత్యంత సున్నితమైన, సున్నిత ప్రాంతాలను గుర్తించి, అక్కడ అదనపు బలగాలను మోహరించేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో భౌగోళిక పరిస్థితులు, గత ఎన్నికల చరిత్ర, ఓటర్ల వివరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే నేర చరిత్ర ఉన్న వ్యక్తులు, రౌడీ షీటర్లు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారి కదలికలను నిరంతరం గమనిస్తూ అవసరమైతే వెంటనే బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఎన్నికలను ప్రభావితం చేసే అక్రమ మద్యం రవాణా, నగదు పంపిణీ, ఉచితాల పంపిణీని కట్టడి చేయాలని, లైసెన్సు కలిగిన ఆయుధాలను తక్షణమే డిపాజిట్ చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఫిర్యాదుల పరిష్కారమే పోలీసుల ప్రధాన లక్ష్యం..**

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ స్నేహ మెహ్రా ఫిర్యాదుదారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనవరి నెలలో ఇప్పటివరకు మొత్తం 52 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ, వారు సమర్పించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు. వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు బదిలీ చేస్తూ, నిర్ణీత గడువులోగా పరిష్కరించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి మంగళవారం, గురువారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమం ద్వారా క్లిష్టమైన, సంక్లిష్ట ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని ఎస్పీ సూచించారు.




# చైనా మాంజాపై సైబరాబాద్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

- **ప్రజలు, వాకర్ల సహకారంతో ప్రమాదకర దారాల తొలగింపు**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

ప్రజలకు గాయాలు, ప్రాణనష్టం జరగకుండా నివారించాలనే ముందస్తు లక్ష్యంతో సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వీధులు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, భవనాలపై కోసి లేదా తెగి వేలాడుతూ ఉన్న ప్రమాదకర మాంజాను గుర్తించి తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ డ్రైవ్‌లో ప్రజలు, వాకర్లు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గచ్చిబౌలి, అమీన్‌పూర్, పటాన్‌చెరు, కొల్లూరు, ఐడిఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు బృందాలుగా ఏర్పడి కొండపూర్, మజీద్ బండ ప్రాంతాల్లో ప్రజల సహకారంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు, రోడ్లు, భవనాల వద్ద ఉన్న మాంజాను తొలగించారు. ప్రమాదకర మాంజా వినియోగించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇలాపూర్ మైదానం, తులసివనం కాలనీల్లో సుమారు 150 మంది వాకర్లతో కలిసి మాంజా దారాలను తొలగించారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మైత్రి గ్రౌండ్, సాకి చెరువు, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాల్లో, అలాగే కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ రేడియల్ రోడ్, ఓజోన్ హైట్స్ గ్రౌండ్ వద్ద స్థానికులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఐడిఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్లపై ఉన్న గాజు నూలును తొలగించారు. ప్రాణాంతక పతంగి నూలు తయారీ, విక్రయం, నిల్వ లేదా వినియోగం చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. ఎక్కడైనా చైనా మాంజా అమ్మకాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



# కల్తీ కోవా స్థావరాలపై 'టాస్క్ ఫోర్స్' దాడి

- **120 కిలోలు స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్**
- **ఎస్పీ స్నేహ మెహ్రా**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హానికరమైన కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఎస్పీ స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీ కోవా తయారీ, విక్రయం జరుగుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వార్ పాషా నేతృత్వంలోని బృందం మెరుపు దాడి నిర్వహించింది. తనిఖీల్లో సుమారు 120 కిలోల కల్తీ కోవాను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ వ్యాపారంలో పాల్గొన్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ప్రకాశ్ విష్ణు, హైదరాబాద్ చాంద్రాయణగుట్టకు చెందిన మొహమ్మద్ సల్మాన్ అనే ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న కల్తీ కోవాతోపాటు నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం తాండూరు పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కల్తీ ఆహార పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా కల్తీ ఆహార తయారీ లేదా విక్రయం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి

- **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వెనుకబాటుపై కలెక్టర్ అసంతృప్తి**

**ముద్ర, నారాయణపేట :**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అర్హులైన నిరుపేదలకు తప్పనిసరిగా లబ్ధి చేకూర్చాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మక్తల్ నియోజకవర్గానికి చెందిన ఉట్కూరు, మక్తల్, మాగనూరు, కృష్ణా, నర్వ మండలాల గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకం, గ్రామ పంచాయతీల ఆస్తి పన్ను వసూళ్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మక్తల్ నియోజకవర్గం వెనుకబడి ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయిలో ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేసి వారం రోజుల్లో ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్న కృష్ణా మండలానికి సంబంధించి ఎంపీడీవోను వివరణ కోరారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ ఉదయం 9:30గంటలలోపు తమ గ్రామాలకు చేరుకోవాలని, లేని పక్షంలో వేతనంలో కోత విధించాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. కారణాలు చెప్పకుండా పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో జాబ్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి కనీసం 100రోజులు ఉపాధి కల్పించాలని, లేబర్ టర్న్‌ఔట్‌ను పెంచాలని ఆదేశించారు. వారం రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ఉపాధి హామీ పథకం అమలు, ఆస్తి పన్ను వసూళ్లలో లక్ష్య సాధనకు కృషి చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ అధికారులను కోరారు.

# రైలు కింద పడి తల్లి, ఇద్దరు పిల్లల బలవన్మరణం

- **చర్లపల్లిలో హృదయ విదారక ఘటన**

**ముద్ర, మేడ్చల్ :**



ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు పిల్లలు రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడిన హృదయ విదారక ఘటన మేడ్చల్ జిల్లాలో చోటుచేసుకుంది. చదువులు, ఉద్యోగం, ఆర్థిక స్థిరత్వం ఉన్న కుటుంబంలో ఇలా విషాదం చోటుచేసుకోవడం స్థానికంగా తీవ్ర కలతకు దారితీసింది. బోడుప్పల్ చెంగిచర్ల హరిత వనం కాలనీకి చెందిన విజయశాంతి రెడ్డి(38), ఆమె కుమార్తె చేతన రెడ్డి(18), కుమారుడు విశాల్ రెడ్డి(16) శనివారం తెల్లవారుజామున చర్లపల్లి-ఘట్కేసర్ రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కింద పడి మృతి చెందారు. పట్టాలపై ముగ్గురు విగతజీవులుగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారని గుర్తించారు. విజయశాంతి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తుండగా, కుమార్తె చేతన చైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం, కుమారుడు విశాల్ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ చదువుల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ కుటుంబానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, అల్లుడు సౌదీ అరేబియాలో ఉద్యోగం చేస్తున్నాడని చెప్పారు. పిల్లల చదువులు కూడా సజావుగా సాగుతున్నాయని తెలిపారు. ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థం కావడం లేదని ఆమె కన్నీరు మున్నీరయ్యారు. రైల్వే పోలీసులకు లభించిన సూసైడ్ నోట్‌లో "బ్రతకాలని లేదు.. అందుకే ఈ నిర్ణయం.." అని మాత్రమే రాసి ఉండటంతో స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఇలా అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోవడం ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.




# మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యం

- **వారం రోజుల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు : డీసీపీ సృజన కరణం**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

మహిళలు, చిన్నారుల భద్రతను ప్రధాన లక్ష్యంగా చేసుకొని సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు పలు రకాల ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించినట్లు డీసీపీ సృజన కరణం తెలిపారు. ఆపరేషన్ స్మైల్ 12లో భాగంగా సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం 110కేసులు నమోదు చేసి, 340 మంది బాలురు, 12 మంది బాలికలు కలిపి మొత్తం 352మంది బాలలను విజయవంతంగా రక్షించినట్లు తెలిపారు. ఈ వారంలో సైబరాబాద్ షీ టీం బృందాలు 138డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 42మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో 47పిటీ కేసులు నమోదు చేయగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. అదేవిధంగా మహిళల నుంచి అందిన 27 ఫిర్యాదులను షీ టీం బృందాలు స్వీకరించినట్లు తెలిపారు. భార్యాభర్తల మధ్య తలెత్తే కుటుంబ సమస్యలను పరిష్కరించడంలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు, సీడీఈడబ్ల్యూ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని డీసీపీ తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా 22 కుటుంబాలను తిరిగి కలిపి, వారి జీవితాల్లో ఆనందాన్ని నింపగలిగామని అన్నారు. మొత్తం 5,821 మంది ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే మహిళల హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100, సైబర్ హెల్ప్‌లైన్ 1930 వంటి సేవల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించినట్లు డీసీపీ తెలిపారు.

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే

**ముద్ర, కాప్రా :**

కాప్రా డివిజన్ పరిధిలోని సప్తగిరి ఎన్‌క్లేవ్‌లో రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్, సీనియర్ నాయకులు ఇంద్రయ్య, కాలనీ అధ్యక్షులు రమాకాంత్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శులు విజయ్, శ్రీకాంత్, ఖజాంచి శర్మ, రమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.




# ఓటర్ల మ్యాపింగ్‌ను వేగంగా పూర్తి చేయాలి

- **కలెక్టర్ ప్రతీక్ జైన్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం ప్రత్యేక ఇంటెన్సివ్ పునః పరిశీలన(ఎస్ఆర్ఐ) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ పురోగతిపై రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు విధివిధానాలపై సూచనలు ఇచ్చారు. ఫిబ్రవరి నెలలోనే నిర్దేశించిన లక్ష్యం మేరకు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటిని సందర్శించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో 61 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. ఫిబ్రవరి నెలలో పట్టణ, గ్రామ స్థాయిల్లో బూత్ స్థాయి అధికారులు సమర్థంగా పనిచేస్తే మ్యాపింగ్ మరింత వేగవంతం అవుతుందన్నారు. దీనిపై తహసిల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మ్యాపింగ్‌లో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే 6, 7, 8 ఫారాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నైమత్ అలీ, తహసిల్దార్లు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరి, విజయ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ప్రపంచంలో అధిక ముడి చమురు నిల్వలు ఉన్న దేశాలు**



4. ఇరాన్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద చమురు నిల్వలు ఇరాన్‌వి. అంతర్జాతీయ ఆంక్షలు చమురు ఎగుమతులను ప్రభావితం చేస్తున్నాయి.

## పదవీ విరమణ పోలీసు అధికారులకు ఘన సన్మానం




**ముద్ర, కరీంనగర్:**
సుదీర్ఘకాలం పాటు విశేష సేవలందించిన ఐదుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం శనివారం కరీంనగర్ కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కమీషనరేటు కార్యాలయం నుండి ఏవో వై.వి. మునిరామయ్య, మహిళా పోలీసు స్టేషన్ నుండి ఎస్సై చల్ల రాజన్న, ట్రాఫిక్ పి.ఎస్. నుండి మహమ్మద్ ముస్తఫా, ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ విభాగం నుండి ఏఆర్ ఎస్సైలు ఖలీల్, మహమ్మద్ బాషు పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ అడిషనల్ డీసీపీ (పరిపాలన) వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తుచేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అడిషనల్ డీసీపీ స్వయంగా పదవీ విరమణ పొందిన వారికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో సిఎస్బి ఏసీపీ శ్రీనివాస్, సిఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, రిజర్వు ఇన్స్పెక్టర్ అడ్మిన్ రజినీకాంత్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై శ్రీ మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గోపు మల్లారెడ్డికి అవకాశం ఇవ్వండి

**- అల్గునూరు ఓటర్లను కోరిన ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోపు మల్లారెడ్డికి కార్పొరేటర్ గా అవకాశం కల్పించాలని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అల్గునూరు ఓటర్లను కోరారు. శనివారం అల్గునూరు లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్న పథకాలు అమలు చేస్తున్నదని చెప్పారు.ఈ ఎన్నికల్లో కార్పొరేటర్ గా గోపు మల్లారెడ్డిని గెలిపిస్తే శీఘ్రగతిన డివిజన్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, డివిజన్ మాజీ కార్పొరేటర్ సల్ల రవీందర్, పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణరెడ్డి, చిందం కిష్టయ్య, కంది అశోక్ రెడ్డి, దాసం నాగేందర్, జాప రాఘవరెడ్డి, జాప మల్లారెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్, ముంజ స్వాతి-శ్రీకాంత్ గౌడ్, అట్ల అనిల్ కుమార్, తొర్తి అరవింద్, ఐతం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో రెపరెపలాడేది కాంగ్రెస్ జెండానే..

**- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ చార్జి వెలిచాల రాజేందర్ రావు**
**- కాంగ్రెస్ లో చేరిన పలువురు నాయకులు**

**ముద్ర, కరీంనగర్:**
కార్పొరేషన్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి నగరపాలక సంస్థపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ బిజెపి భూస్థాపితం కావడం ఖాయమైందని విమర్శించారు. ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. కరీంనగర్లో శనివారం రాజేందర్ రావు సమక్షంలో34 డివిజన్ నుండి పూర్ణచందర్, 47 నుండి బండి సురేందర్ గౌడ్,49 డివిజన్ నుండి పద్మశ్రీ కాంగ్రెస్ లో చేరారు. బీఆర్ఎస్ నుంచి జెల్లోజు జ్యోతి శ్రీనివాస్ నుంచి కాంగ్రెస్లో చేరారు. వారందరికీ రాజేందర్ రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ బిజెపి కార్పొరేషన్ ఎన్నికల్లో కుమ్మక్కు అయ్యాయని ఆరోపించారు. ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అభ్యర్థులంతా మంచి మెజార్టీతో విజయం సాధించబోతున్నారని రాజేందర్ రావు తెలిపారు.



# మేయర్, మూడు ఛైర్మన్ పీఠాలు మావే..

**- గెలిచే చోట కార్యకర్తలకే సీట్లు ఇస్తున్నాం.. - గెలిచే అవకాశం లేనిచోట మాత్రమే ప్రత్యామ్నాయ నేతలకు టిక్కెట్లు**
**- టిక్కెట్ రాని వారికి నామినేటెడ్, పార్టీ పదవులతో న్యాయం చేస్తాం.. - కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**





**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠంతో పాటు, పార్లమెంటు పరిధిలోని 3 మున్సిపాలిటీలను బీజేపీ కైవసం చేసుకుంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం స్థానిక శుభం కన్వెన్షన్ లో కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంఛార్జీలు, కన్వీనర్లు, కో కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకే టిక్కెట్ల కేటాయింపులో అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్ లో 80 శాతం పైగా టిక్కెట్లు వారికే ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. గెలిచే అవకాశం లేని మిగిలిన స్థానాల్లో మాత్రమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. టిక్కెట్లు రాని కార్యకర్తలు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. నామినేటెడ్ పోస్టులతోపాటు, పార్టీ పదవులిచ్చి వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. కరీంనగర్ లో జరిగిన అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులవల్లనేనని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ఆగకూడదంటే బీజేపీకి ఓటేసి ఆశీర్వదించాలని కోరుతూ ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరారు. మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తానని చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండాను ఎగరేసే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. టిక్కెట్ ఆశించి భంగపడిన కార్యకర్తలను సముదాయించి బీజేపీ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేసేలా చూడాలని కోరారు.
ఈ సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, పార్టీ సీనియర్ నేతలు సాయిని మల్లేశం, గుజ్జ శ్రీను, ఇనుగొండ నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా**




**ముద్ర, ఆదిలాబాద్:**
రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమ, నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా పట్టణంలో '2K రన్' నిర్వహించారు. ఈ పరుగు స్థానిక ఆర్.టి.ఓ. కార్యాలయం నుండి ప్రారంభమై ప్రియదర్శిని స్టేడియం వరకు రోడ్డు భద్రతా నినాదాలతో కొనసాగింది.
ఈ సందర్భంగా స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోడ్డు నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, హెల్మెట్ ధరించడం, అతి వేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని అన్నారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షల మంది రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని, విద్యార్థులు, యువత, ప్రజలు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, విద్యార్థులు తమ తల్లితండ్రులకు, బంధుమిత్రులకు రహదారి భద్రత అవగాహన కల్పించాలని సూచించారు. నెల రోజుల పాటు రవాణా శాఖ చేపట్టిన అవగాహన కార్యక్రమాలు ప్రశంసనీయమని కలెక్టర్ అధికారులను అభినందించారు. తదుపరి 2కే రన్‌లో విజేతలకు, అతిథులకు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు.
ఈ కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఉప రవాణా కమిషనర్ రవీందర్ కుమార్, డివైఎస్ఓ శ్రీనివాస్ గారు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా రవాణా అధికారి ఎస్.శ్రీనివాస్, విద్యార్థులు, యువత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటించడం అందరి బాధ్యత

**కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**ముద్ర, కరీంనగర్:**
ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శనివారం తిమ్మాపూర్ లోని ఆర్టీఏ కార్యాలయంలోని జువ్వాడి చొక్కా రావు (సారథి) చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ఆడిటోరియంలో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ముగింపు సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారుల అజాగ్రత్త నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. తిమ్మాపూర్ సారథి చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ లో ఇప్పటి వరకు దాదాపు 22,000 మంది విద్యార్థులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. పాఠశాలల విద్యార్థులు అవేర్నెస్ పార్క్ ను సందర్శించి రూల్స్ పై శిక్షణ పొందాలని సూచించారు. అడిషనల్ డిసిపి వెంకట రమణ ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ అవేర్నెస్ లో భాగంగా నిర్వహించిన క్విజ్, రంగోలి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు, మహిళలకు బహుమతులు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ ఆర్ అండ్ ఈ ఈ నరసింహాచారి ఎంవీఐ రవికుమార్ తిమ్మాపూర్ సిఐ సదన్ కుమార్ ఏఎంవీఐలు స్రవంతి, హరిత చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ఇన్స్ట్రక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి..

**- బీఎల్ఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లాలి: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**
**- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**




**ముద్ర, కరీంనగర్:**
ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లాలని త ద్వారా సత్వరమే మ్యాపింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా కలెక్టరేటు కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. 2002 వివరాలతో, ప్రస్తుత వివరాలు సరిపోల్చి మ్యాపింగ్ ప్రక్రియను తర్వాతగతిన పూర్తి చేయాలని సూచించారు. బిఎల్ఓలు రోజువారీగా చేపట్టి ప్రోజెని మ్యాపింగ్ వివరాలను తమకు అందిస్తూ ఉండాలని పేర్కొన్నారు. బిఎల్ఓలకు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎబిఎల్ఓలు సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియలో తప్పులు జరగకుండా చూడాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 2002 ఓటర్ లిస్టు ప్రకారం కొత్త ఓటర్ లిస్టు మ్యాపింగ్ త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బిఎల్వోలతో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై సమీక్ష నిర్వ హించారు. కరీంనగర్ అర్బన్ లో మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు.
వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కుందారపు మహేష్, రమేష్ బాబు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

**సిరిసిల్లలో విద్యార్థుల భారీ ర్యాలీ**

**ముద్ర, రాజన్న సిరిసిల్ల:**
జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో సుమారు 2000 మంది ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో శనివారం మెగా ర్యాలీ నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక బతుకమ్మ ఘాట్ నుండి పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు రోడ్డు భద్రతకు సంబంధించి ప్ల కార్డులు పట్టుకొని రోడ్డు భద్రత గురించి నినాదాలు చేస్తూ, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వలన కలుగే ప్రాముఖ్యతను వివరించారు.
ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల ద్వారానే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ర్యాలీ అనంతరం రహదారి భద్రత నియమాలపై ప్రతిజ్ఞ చేయించారు.
ఈ కార్యక్రమంలో డిఎస్పి నాగేంద్ర చారి,సీఐ కృష్ణ, మోటారు వాహనాల తనిఖీ అధికారి రజని,పృథ్వీరాజ్ వర్మ, సిబ్బంది రమ్య, సౌమ్య, ప్రశాంత్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రపంచంలో అధిక ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలు**

5. ఇరాక్

అత్యంత నాణ్యమైన చమురు నిల్వలు ఉన్న దేశం. రాజకీయ అస్థిరత అభివృద్ధికి అడ్డంకిగా మారుతోంది.



# ప్రజావాణి రద్దు

- **భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

ముద్ర ప్రతినిధి, భువనగిరి : తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినందున కోడ్ అమలులో ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఉండదని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. విషయాన్ని జిల్లాలోని ప్రజలు గమనించి వివిధ సమస్యల పై అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు రావొద్దని తెలిపారు.

# పకడ్బందీగా మ్యాపింగ్ ప్రక్రియ

- **రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**




ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, ఈఆర్ఓ లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు ముందు గా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. 40 సంవత్సరాల లోపల ఉన్న మహిళల మ్యాపింగ్ ను వారి తల్లిదండ్రుల వివరాల ఆధారంగా చేయాలని, బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని, బ్లర్డ్ ఫొటోస్, డబుల్ ఎంట్రీలపై దృష్టి సాధించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి,ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ నేతలకు బుద్ధి చెప్తాం

- **నడిగూడెం మండల టీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు**

**ముద్ర నడిగూడెం:**

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పై చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టి కాంగ్రెస్ కు బుద్ధి చెప్తామని నడిగూడెం మండల టిఆర్ఎస్ సమన్వయ నాయకులు అనంతల ఆంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ .. ప్రజల కోసం నిరంతరం పనిచేసిన మాజీ ఎమ్మెల్యే మల్లయ్య క్లీన్ ఇమేజ్ ను దెబ్బతీయడమే ధ్యేయంగా గ్రామ స్థాయి నేతలు నోరు పారేసుకోవడం హాస్యాస్పదం అని అన్నారు. దమ్ముంటే నిష్పక్షపాతంగా విచారణ జరిపించి నిజాలు తేల్చాలని తప్పుడు ఆరోపణలతో బురద చల్లడం ఆపండి అని అన్నారు. ఒక దళిత యువకుడి మరణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి పాత విషయాలను, స్కామ్‌లను తెరపైకి తెస్తున్నారు. కోదాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందాయని, తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రజలే మీకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దున్న సుధాకర్ బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి మేకల గంగరాజు మండల నాయకులు బొల్లం శ్రీనివాస్ నల్లమాద నారాయణరావు వల్లెపు శ్రీనివాస్ ఉద్యమ నాయకులు మహమ్మద్ రఫీ, నడిగూడెం గ్రామ కార్యదర్శి కాసాని సతీష్, యూత్ నాయకులు మేకల వీరబాబు, అమర బోయిన సైదారావు, పోలెబోయిన నాగరాజు, శ్రీరాముల శేషు చరణ్ తదితరులు పాల్గొన్నారు




# యద్దనపూడి స్ఫూర్తితో వృత్తి విలువలను కాపాడుకోవాలి

- **15 వ వర్ధంతి సభలో వక్తల పిలుపు**

**ముద్ర, తాడేపల్లిగూడెం:**

ఆరు దశాబ్దాల పాటు పత్రికారంగంలో, ప్రజా జీవితంలో కొనసాగిన యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి జీవితాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏపీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సుప్రసిద్ధ పాత్రికేయుడు, సంఘ సేవకుడు యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో యద్దనపూడి స్మారక ఉత్తమ జర్నలిస్ట్ పురస్కార ప్రదానంతో పాటు, సీనియర్ పాత్రికేయులను గౌరవించారు. తొలుత సీనియర్ పాత్రికేయుడు యద్దనపూడి అవార్డు కమిటీ సభ్యుడు తేతలి గంగాధరరెడ్డి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గజపతి వరప్రసాద్ మాట్లాడుతూ యద్దనపూడి పేరిట పదిహేనేళ్లుగా అవార్డులు, సత్కారాలు ఇస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశాలాంధ్ర దినపత్రిక స్టేట్ బ్యూరో చీఫ్ చావా రవి మాట్లాడుతూ నిన్నటి తరం పాత్రికేయుల కృషిని నేటితరం పాత్రికేయులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణ చరిత్ర నిర్మాతల్లో యద్దనపూడి ఒకరన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి రవి అగర్వాల్, పీఎంపీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీ.బీ.టి. రాజు, త్యాగరాజగాన సభ అధ్యక్షుడు గరికపాటి బాపయ్య శర్మ, జనతా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎల్.ఎస్.వి. నాగేశ్వరరావు, ఎంపీడీవో చంద్రశేఖర్ , ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపల్లి మురళీకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కోలాటి మోషేబాబు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలడుగు సతీష్, ప్రెస్ క్లబ్ పూర్వ కార్యదర్శులు మైలవరపు రవి కిరణ్, యద్దనపూడి సుబ్బారావు, సీనియర్ పాత్రికేయుడు ఆకుల ప్రసాద్, తదితరులు మాట్లాడారు.

**అవార్డు ప్రదానం..**

అనంతరం 2025 సంవత్సరానికి గాను యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డును చింతలపూడి ఆంధ్రప్రభ విలేఖరి ఎస్. కె. అజాద్ బాబు కు అందచేశారు. అవార్డు పారితోషికంగా 5116 రూపాయలు, జ్ఞాపిక, నూతన వస్త్రాలు, శాలువా అందచేశారు.

సీనియర్ పాత్రికేయుల గౌరవ సత్కారంలో భాగంగా ఏలూరు కు చెందిన గోపికృష్ణ దినపత్రిక సంపాదకులు ద్రోణంరాజు వెంకటరమణ, ఆకివీడుకు చెందిన సాక్షి విలేఖరి బి.రామ కోటేశ్వరరావు, తాళ్లపూడికి చెందిన విశాలాంధ్ర విలేఖరి అప్పన రాజా ను అతిథులు సత్కరించారు. అంతకు ముందు తాలుకా ఆఫీసు కూడలిలో ఉన్న యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి విగ్రహానికి ముఖ్య అతిథి చావా రవి, పాత్రికేయులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిటీ కేబుల్ మేనేజర్ వై.ఎన్.వి. రమేష్, సీనియర్ పాత్రికేయులు షేక్ ఖాదర్ మొహిద్దీన్, చిట్యాల రాంబాబు, తేతలి గంగాధరరెడ్డి, ఎ.వి.రామరాజు, ఆలమండ నరసింహరావు, కే. ఆశీర్వాదరావు, పెద్దోజు మురళి, కుదుళ్ల నారాయణ రావు, గారపాటి ప్రసాద్, శీలి మహేష్, చింతకాయల దొరబాబు, కళింగ లక్ష్మణరావు, ఏం.యేసు, కే. ఆనంద్ కుమార్, బూర్గుల భాను శ్రీనివాస్, ఎస్. రాంబాబు, బాసంశెట్టి బాలాజీ, శ్రీనివాస్, చిట్రోజు కృష్ణ, ఎస్.వీర్రాజు, శీలి రాజు, కే.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కు నోటీసులివ్వడం బాధాకరం

- **ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**
- **కొత్తగూడెంలో బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశం**

**ముద్ర, కొత్తగూడెం :**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్స్ ట్యాపింగ్ జరిగాయన్న ఆరోపిస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ప్రచారం చేసి, కేసులు పెట్టి ప్రధాన ప్రతిపక్షానికి చెందిన అగ్ర నాయకత్వానికి వరుసగా నోటీసులిస్తూ, విచారిస్తుండడం బాధాకరమన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది భద్రతకు, పోలీసుల విధి నిర్వహణకు సంబంధించినదే తప్ప, ముఖ్యమంత్రి, మంత్రులకు ఇందులో ఏ మాత్రం ప్రమేయం ఉండదని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బంజారాహిల్స్ నందినగర్ లోని నివాసానికి పోలీసులు రాత్రి పూట దొంగచాటుగా వచ్చి నోటీసులు అంటించి పోవడం పట్ల ఎంపీ రవిచంద్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సిట్ పోలీసులు కేసీఆర్ కు నోటీసులిచ్చిన నేపథ్యంలో ఎంపీ రవిచంద్ర కొత్తగూడెం తెలంగాణ భవన్ లో శనివారం సాయంత్రం బీఆర్ఎస్ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడాన్ని, విచారణకు పిలవడాన్ని వ్యతిరేకిస్తూ కొత్తగూడెంలో ఆదివారం నల్ల జెండాలు చేతబట్టి ద్విచక్ర వాహనాలతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలకు అనుగుణంగా శాంతియుత పద్ధతుల్లో జరిపే ఈ నిరసన ప్రదర్శనకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావలసిందిగా ఎంపీ రవిచంద్ర కోరారు. మునిసిపల్ ఎన్నికల్లో నామినేషన్లు వేసిన ఆశావహుల పేర్లతో కూడిన జాబితాను కేటీఆర్ కు పంపించామని,ఆయన అభ్యర్థులను ఖరారు చేసి బీఫారం పంపుతారని ఎంపీ రవిచంద్ర తెలిపారు. తనతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావుల ఏకాభిప్రాయంతో ఆశావహుల జాబితాను రూపొందించి పార్టీ అధి నాయకత్వానికి నివేదించినట్లు ఎంపీ రవిచంద్ర చెప్పారు.




# భూ భారతి సర్వే ప్రారంభం

- **పైలట్ ప్రాజెక్టుగా కాగిత రామచంద్రపురంలో శ్రీకారం**

**ముద్ర నడిగూడెం:**

రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి భూసర్వే కార్యక్రమం నడిగూడెం మండల పరిధిలోని కాగిత రామచంద్రపురం లో శనివారం అధికారికంగా ఏడి నరసింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన రైతుల అవగాహన సభలో ఆయన మాట్లాడుతూ.., భూ భారతి భూ సర్వే ద్వారా గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల సరిహద్దులు,విస్తీర్ణం, భూ హక్కుల వివరాలు సమగ్రంగా, ఖచ్చితంగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సర్వే కార్యక్రమం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, భూ రికార్డులు మరింత పారదర్శకంగా, నమ్మదగినవిగా మారతాయని పేర్కొన్నారు. గ్రామ రైతులు, ప్రజలు సర్వే ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని, తమ భూములను సర్వే చేయించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ.. భూ భారతి భూ సర్వే కార్యక్రమం ద్వారా భూపరిపాలన మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోదాడ డీఐ ముత్యానాయక్, గ్రామ సర్పంచ్ చక్రాల ఉమా పిచ్చయ్య, ఆర్ఐ లు గోపి, మన్సూర్ అలీ, జిపిఓ నరసింహారావు, కార్యదర్శి అనిల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.






# కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

దేశవ్యాప్త ఈ నెల 12న నిర్వహించే కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య పిలుపునిచ్చారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఢిల్లీ మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బి ఆర్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరివెళ్ల ప్రభాకర్, ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు నరేష్, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ ఆంజనేయులు పాల్గొన్నారు

# నామినేషన్ల స్క్రూటినీ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



భువనగిరి మున్సిపాలిటీకి దాఖలైన నామినేషన్ పత్రాలను శనివారం అధికారులు స్క్రూటిని నిర్వహించారు. 35 వార్డులకు గాను 305 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు కాగా వాటిని స్క్రూటిని చేయగా 2 నామినేషన్ పత్రాలలో సంతకాలు లేకపోవడంతో తిరస్కరించామని అధికారులు తెలిపారు. మొత్తం 181 నామినేషన్లు సరిగా ఉన్నాయని, వాటిలో అధికార కాంగ్రెస్ పార్టీ తరపున 55, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ తరపున 51, బీజేపీ నుండి 45, బిఎస్పీ 3, కమ్యూనిస్టులు 1, ఏఐఎంఐఎం 2, స్వతంత్ర అభ్యర్థులుగా 24 నామినేషన్లు ఉన్నాయని చెప్పారు. ఈనెల 3 వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు.

# సీఎం కప్ విజేత జేతురం తండా

**ముద్ర, తుర్కపల్లి:**

తుర్కపల్లి మండలంలో నిర్వహించిన సీఎం కప్ టోర్నమెంట్ లో కబడ్డీ విభాగంలో జేతురం తండా గ్రామ యువకులు మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. ద్వితీయ బహుమతి మోడల్ స్కూల్ విద్యార్థులకు దక్కింది. ఈ సందర్భంగా జేతురం తండా సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ.., గ్రామానికి ఈ విజయం గర్వకారణమని, యువకులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సక్కు మోహన్ నాయక్, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# లైంగిక వేధింపులు అరికట్టేందుకు కమిటీలు

- **భద్రాద్రి జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా**

**ముద్ర, కొత్తగూడెం:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని కార్యాలయాలు, సంస్థలు, ప్రభుత్వం, ప్రైవేటు రంగాలకు చెందిన సంస్థలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 ప్రకారం తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాట్లు చేయాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా సూచించారు. She box portal web site :http:// shebox.wcd.gov.in ICC ఏర్పాటు చేయని లేదా ఐసీసీ వివరాలు పోర్టల్ లో నమోదు చేయని సంస్థల పై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రైవేటు సంస్థలు , వ్యాపార సంస్థలు , పరిశ్రమలు వెంటనే అంతర్గత ఫిర్యాదు కమిటినీ ఏర్పాట్లు చేసి పూర్తి వివరాలు షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేయాలని కోరారు. అంతర్గత ఫిర్యాదు కమిటీ సభ్యుల వివరాలు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం లో అందించాలని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను, విద్యా సంస్థల యాజమాన్యాలకు తెలియజేశారు.

ప్రపంచంలో అధిక ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలు

6. రష్యా
చమురు, సహజవాయు రంగాల్లో అగ్రగామి. యూరప్‌కు ముఖ్యమైన ఇంధన సరఫరాదారుగా ఉంది.





# ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకం

- **కలెక్టర్ రాహుల్ రాజ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మున్సిపల్ పోలింగ్ నిర్వహణలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి శనివారం కలెక్టరేట్ లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజుకు ఒక రోజు ముందు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకొని పోలింగ్ నిర్వహణకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్లు, ఇతర పోలింగ్ సామగ్రిని సంబంధిత రిటర్నింగ్ అధికారి వద్ద సేకరించాలన్నారు. చెక్ లిస్ట్ ఆధారంగా సరిచూసుకోవాలని సూచించారు. జోనల్ అధికారి పోలీస్ ఎస్కార్ట్ తో పాటు సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ రోజున ఉదయం 6:30 కు పోలింగ్ ఏజెంట్లు సమక్షంలో బ్యాలెట్ బాక్స్ సీల్ చేసి ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి తో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనకు లోబడి ఎన్నికల సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు.

ఎన్నికల మాస్టర్ శిక్షకులు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎన్నికల విధులు, ప్రిసైడింగ్ అధికారి నింపాల్సిన ఫారాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

**పదో తరగతి ఫలితాలపై టెలీకాన్ఫరెన్స్..**

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ఎంఈఓ లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా హాజరు ఉండాలన్నారు. గైర్హాజర్ అయిన విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు తీసుకురావాల్సిన బాధ్యత ఉందన్నారు. సోమవారం నుంచి పదో తరగతి విద్యార్థుల హాజరు తానే స్వయంగా పరిశీలిస్తానన్నారు. ప్రత్యేక తరగతులు తప్పకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉదయం సాయంత్రం పదో తరగతికి బోధించే ఉపాధ్యాయులు సెలవులు పెట్టొద్దన్నారు. డిఈఓ విజయ, ఏఎంఓ సుదర్శన మూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల కోసం పోరాడేవారే గద్దర్ వారసులు

- **టీ జేఏసీ నేత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి. పాపయ్య**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

ప్రజల కోసం పోరాడేవారే గద్దర్ నిజమైన వారసులని టీ జేఏసీ నేత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి. పాపయ్య అన్నారు. పట్టణంలో దళిత బహుజన సంఘాల, ప్రజా సంఘాల నేతలు ప్రజాయుద్ధ నౌక గద్దర్ 78వ జయంతి నిఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టబడుదారులకు కట్టబెడుతూ, ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్న నేటి తరుణంలో ప్రజల పక్షాన నిలబడి, ప్రజా పోరాటాలకు అండగా నినదించడమే గద్దర్ అన్నకు మనమిచ్చే నివాళులు అన్నారు. విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ పోచబోయిన శ్రీహరి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడు ఎకరాల్లో స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించి రెండేళ్లు గడిచినా ఆ పేరే ఎత్తడం లేదన్నారు. గద్దర్ అన్న ఆటపాటలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ ఇకనైనా వెంటనే స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కో చైర్మన్ ఆస లక్ష్మణ్ మాట్లాడుతూ సిద్దిపేటలో త్వరలోనే అన్ని దళిత, బహుజన, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల సహకారంతో గద్దర్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందామని ప్రకటించారు. ప్రశ్నిస్తున్న, పోరాడుతున్న ప్రజలకు అండగా నిలబడదామని పిలుపునిచ్చారు. కాగా బహుజన సాహితీవేత్త భీమసేన గద్దర్ పాటలతో అందరికి స్ఫూర్తి నింపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి విక్రమ్ రెడ్డి, మంజీరా రచయితల సంఘం నాయకులు సిద్ధంకి యాదగిరి, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు బత్తుల చంద్రం, ధర్పల్లి శ్రీనివాస్, గ్యాదరి జగన్, మేరుగు మహేష్, పయ్యావుల రాములు, ఎద్దు యాదగిరి, కోరే ఎల్లయ్య, బోయ రాములు, చింతల కుమార్, యాద నరేందర్ కోత్వాల్, కౌన్సిలర్ భూంపల్లి శ్రీహరి, ఆకుల ప్రశాంత్, పోతుల మోహన్, పాతుకుల వెంకటేశం, శాతరాజు ఆంజనేయులు, కుంభాల ఎల్లారెడ్డి, డీబీఎఫ్ నేత మెట్ల శంకర్, పడిగె ప్రశాంత్, సంతోష్ గౌడ్, తరిగొప్పుల రామచంద్రం, ఆసబాబు అక్బర్, దెబ్బేట ఆనంద్ తోపాటు స్థానిక సర్పంచ్ అమ్ముల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# విజయవంతంగా ఆపరేషన్ స్మైల్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జిల్లాలో నెల రోజుల వ్యవధిలో అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగినట్లు అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు. శనివారం పోలీసు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ స్మైల్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు, వ్యాపార సముదాయాలు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి, వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచినట్లు చెప్పారు. మొత్తం 81 మంది బాలలను రక్షించగా, అందులో 69 మందిని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించామన్నారు. మిగిలిన 12 మందిని సంరక్షణ కేంద్రాలకు తరలించామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 52 కేసులు నమోదు చేశామన్నారు. బాల కార్మికులను పనిలో ఉంచుకుంటున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా వ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడం అభినందనీయమన్నారు. ఇందులో జడ్పీహెచ్ఎస్ టేక్మాల్‌లో ఇద్దరు, నాగసన్‌పల్లి పాఠశాలలో ఇద్దరు, మెదక్ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఇద్దరు బాలలను చేర్పించినట్లు తెలిపారు. ఈ చిన్నారుల్లో చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు కూడా ఉన్నారని పేర్కొన్నారు.పిల్లల బాల్యం బడులకు అంకితం కావాలని, బాలలు కార్మికులుగా మారకుండా విద్యాబాటలో నడవాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, సీడబ్లుసి ఉప్పలయ్య, లేబర్ డిపార్టుమెంట్ నాగరాజు, మెదక్ ఎల్ఓ సత్యేంద్ర ప్రసాద్, రామాయంపేట్ ఎల్ఓ రాజు, ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ రాజు, మిషన్ ఎన్జీవో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రాజు, సీఎస్ఎం ఎన్జిఓ సంజీవ్, యాదగిరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీఎల్‌వోలు సమర్థవంతంగా పనిచేయాలి

- **కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**



ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను నిర్ణీత గడువులో వేగవంతంగా పూర్తి చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్‌లో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఈఆర్‌వోలు (EROs) సమగ్ర పర్యవేక్షణ చేపట్టి, ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. బీఎల్‌వోలు, సూపర్వైజర్లకు స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, క్షేత్రస్థాయిలో ప్రక్రియ వేగంగా సాగేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేశామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నోటీసులతో కేసీఆర్‌ను ఏమీ చేయలేరు

**ముద్ర, నిజామాబాద్:**

నోటీసులతో కేసీఆర్‌ను ఏమీ చేయలేరని నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్, నాయకుడు ఎంఎ హకీం అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రచురించిన క్యాలెండర్, డైరీని ఆయన ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేక కక్ష సాధింపులతో కాలాన్ని గడుపుతోందని ఆరోపించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడం మూర్ఖత్వమన్నారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడమంటే కోట్లాది తెలంగాణ ప్రజల గుండెలను గాయపరిచినట్లేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ ప్రజల దృష్టి మళ్లిస్తున్నారన్నారు. యాసంగి పంటకు వెంటనే రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని, వర్షాకాలంలో వర్షాలు పడి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరిఫ్, ఎజాజ్,సాయిలు, సాయినాథ్, సద్దాం, ప్రవీణ్, ఇబ్రాహీం, తదితరులు పాల్గొన్నారు.



# చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జాక్టో పిలుపు మేరకు పీఆర్ టీయూ టీఎస్ మెదక్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేడి సతీష్ రావు, ఎం.సామ్యా నాయక్ ఆధ్వర్యంలో శనివారం చలో ఢిల్లీ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 5న నిర్వహించే చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కోరారు. విద్యా హక్కు చట్టం 2009 లోని సెక్షన్ 23ను సవరించి 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు సబాని శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్, ఎస్ టీయూ మాజీ ప్రధాన కార్యదర్శి పోచయ్య, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శంకర్ రెడ్డి, శ్రీకాంత్, స్వామి, నాగరాజ్ గౌడ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ సెల్ జిల్లా కార్యదర్శిగా రెడ్డి మహేందర్ రెడ్డికి రాష్ట్ర కో కన్వీనర్ నాయిని నరసింహా రెడ్డి తో కలిసి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల సబ్సిడీలు ప్రవేశపెట్టి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందోన్నారు. గతేడాది యూరియా కోసం రైతులు పడ్డ తిప్పలు ఈ సంవత్సరం ఉండవన్నారు. రైతులు ఇంటి వద్ద నుంచే మొబైల్ ద్వారా యూరియా బుక్ చేసుకునే విధంగా ప్రభుత్వం కార్యచరణ రూపొందించిందని గుర్తు చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ నాయకులు మహిపాల్ రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



# సీఎం కుట్రలను ప్రజలు సహించరు

- **సీఎం కుట్రలను ప్రజలు సహించరు**

**ముద్ర, నిజామాబాద్:**

నిజామాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలను ప్రజలు సహించబోరని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసిఆర్‌కు సిట్ నోటీసు జారీ చేయడంపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ తన స్వగ్రామంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను వేల్పూర్‌లో దగ్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యమ నాయకుడిగా, రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడమేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లో తీవ్ర అభద్రతా భావం పెరిగిపోయిందని, తన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో కప్పిపుచ్చుకునేందు సిట్‌లు, కమిషన్ల పేరుతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారని మండిపడ్డారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రపంచంలో అధిక ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలు**

7. కువైట్
చిన్న దేశమైనప్పటికీ భారీ చమురు నిల్వలు ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చమురుపైనే ఆధారపడింది.





## బంగాళాఖాతంలో 'నో ఫ్లై జోన్'..
# ఏం జరుగుతోంది?

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

బంగాళాఖాతంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో సుమారు 3,190 కిలోమీటర్ల మేర 'నో ఫ్లై జోన్' విధిస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అంతర్జాతీయ రక్షణ వర్గాల్లో ఆసక్తి కర చర్చకు దారితీసింది. సాధారణంగా క్షిపణి పరీక్షల సమయంలో ఇటువంటి ఆంక్షలు సహజమే అయినప్పటికీ ఈసారి ప్రకటించిన విస్తీర్ణం గతంలో కంటే గణనీయంగా ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది కేవలం ఒక సాధారణ పరీక్ష కాదు.. భారత అమ్ములపొదిలో చేరబోతున్న ఒక భారీ అస్త్రానికి సంకేతమని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**వ్యూహాత్మక మార్పు:**

**ఆపరేషన్ సిందూర్ పాఠాలు**

గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' అనుభవాల తర్వాత భారత్ తన రక్షణ వ్యూహాన్ని సమూలంగా మార్చుకుంది. ఆధునిక యుద్ధ తంత్రం కేవలం సంఖ్యాబలం మీద కాకుండా అత్యాధునిక సాంకేతికత, ఖచ్చితత్వంతో కూడిన క్షిపణి వ్యవస్థల మీద ఆధారపడి ఉంటుందని గుర్తించింది. అందుకే స్వదేశీ ఆయుధాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రక్షణ బడ్జెట్‌ను పెంచడమే కాకుండా సముద్రం, గగనం, భూమి.. ఇలా మూడు మార్గాల ద్వారా శత్రువును అడ్డుకునేలా 'ట్రైయాడ్' సామర్థ్యాన్ని పెంచుకుంటోంది.

**ప్రయోగం వెనుక లక్ష్యం ఏమిటి?**

ప్రస్తుతం విధించిన 3,190 కిలోమీటర్ల పరిధిని బట్టి చూస్తే, భారత్ లాంగ్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్ లేదా అప్‌గ్రేడ్ చేసిన బ్రహ్మోస్ సుదీర్ఘ శ్రేణి వెర్షన్‌ను పరీక్షించే అవకాశం ఉంది. బ్రహ్మోస్ ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు పొందింది. దీన్ని మరింత ఆధునికీకరించి సుదూర లక్ష్యాలను ఛేదించేలా రూపొందించడం భారత్ ప్రాధాన్యతగా మారింది. మరోవైపు రష్యా నుంచి ఎస్ 500 క్షిపణి వ్యవస్థల కొనుగోలు ఒప్పందం ఒకవైపు సాగుతుండగానే దేశీయంగా ఇటువంటి భారీ ప్రయోగాలు చేపట్టడం భారత ఆత్మనిర్భరతకు నిదర్శనం.

**పొరుగు దేశాల ఆందోళన.. భారత్ స్పష్టత**

భారత రక్షణ సామర్థ్యం పెరుగుతుంటే పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో సహజంగానే కొంత ఆందోళన కనిపిస్తోంది. అయితే భారత్ ఎప్పుడూ తన శక్తిని దురాక్రమణకు వాడుకోలేదని చరిత్ర చెబుతోంది.భారత్ తన ప్రయోగాలను కేవలం రక్షణాత్మక చర్యలుగానే పేర్కొంటోంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతిని నెలకొల్పడానికి, బలమైన రక్షణ వ్యవస్థ అవసరమని భారత్ విశ్వసిస్తోంది.

సముద్ర గర్భం నుంచి అంతరిక్షం వరకు తన పట్టును నిరూపించుకోవడానికి భారత్ సిద్ధమవుతోంది. బంగాళాఖాతంలో వెలువడే ఆ క్షిపణి గర్జన, దేశ భద్రత విషయంలో భారత్ ఎవరికీ తలవంచదని చెప్పే బలమైన సందేశం. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, స్వదేశీ పరిజ్ఞానంతో ప్రపంచ శక్తులకు దీటుగా ఎదగడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రయోగాలు భవిష్యత్ భారత్ రక్షణ కవచానికి మలుపు రాయి కానున్నాయి.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి vs తెలంగాణ పోలీస్

- **ఎట్టకేలకు వివాదానికి ఫుల్‌స్టాప్**
- **వార్నింగ్ తో వెనక్కి తగ్గిన గులాబీ నేత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




నిత్యం వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈసారి మరింత తీవ్రమైన వివాదంలో ఇరుక్కున్నారు. ఆయన చేసిన పనికి పోలీసు అధికారుల సంఘం, ఐపీఎస్ అసోసియేషన్ బహిరంగ ప్రకటనలు విడుదల చేశాయి. కౌశిక్‌పై చర్యలు తీసుకోవాలంటూ, బహిరంగ క్షమాపణలు చెప్పాలంటూ వార్నింగ్‌లు ఇచ్చాయి. దీంతో అధిష్ఠానం సూచన మేరకు కౌశిక్ రెడ్డి ఒక అడుగు తగ్గి తన వల్ల తప్పు జరిగి ఉంటే క్షమించాలని ప్రత్యేకంగా వీడియో మెసేజ్ విడుదల చేశారు. ఈ వీడియోతో వివాదం తాత్కాలికంగా ముగిసింది.

గురువారం సాయంత్రం కరీంనగర్‌లోని వీణవంక మినీ మేడారం జాతరకు తన భార్య, కూతురు, కొందరు అనుచరులతో సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు వెళ్లారు. కౌశిక్ రెడ్డి భారీ కాన్వాయ్‌తో ఆలయం వద్దకు చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వాహనాలు వదిలి నడుచుకుంటూ రోడ్డుపై బైఠాయించారు. కౌశిక్ రెడ్డి ఆందోళన చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళన చేస్తున్న ఆయన గద్దెల వద్దకు వెళ్లేందుకు యత్నించారు. అడ్డుకోవడంతోపాటు బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించారు. ఈ క్రమంలోనే పెనుగులాట చోటు చేసుకుంది. ఇలా కౌశిక్ రెడ్డి వర్సెస్ పోలీసుల రచ్చ పెను దుమారం రేపింది. అసెంబ్లీ స్పీకర్‌ను కలిసి ఎమ్మెల్యేనైన తన వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారని, తన భార్యతో మరో దళిత మహిళా సర్పంచ్‌ను సైతం సీపీ, ఏసీపీ ఈడ్చుకుంటూ తీసుకెళ్లారంటూ ఫిర్యాదు చేశారు కౌశిక్ రెడ్డి. పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

**తెలంగాణ పోలీసు అధికారుల సంఘం ఆగ్రహం ..**

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలీసుల మీద చేసిన వ్యాఖ్యలను, ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామంటూ తెలంగాణ పోలీసు అధికారుల సంఘం లేఖ విడుదల చేసింది. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తున్న పోలీసుల పట్ల ఎమ్మెల్యే చేసిన అసభ్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా గుంపులుగా వెళ్లి, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం దురదృష్టకరమన్నారు. అక్కడి శాంతి భద్రతల గురించి, కోర్టు ఉత్తర్వుల గురించి ఎమ్మెల్యేకి వివరించినప్పటికీ వారు అనుచితంగా ప్రవర్తించారని అన్నారు. మహిళా పోలీసు అధికారులపట్ల కూడా దురుసుగా ప్రవర్తించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం సరికాదన్నారు.

బాధ్యత గల ఎమ్మెల్యేగా ఉండి పోలీసు అధికారుల మత ప్రస్తావన తేవడం అత్యంత గర్హనీయమని పోలీసు అధికారుల సంఘం అంది. పైగా అక్కడ లేని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ను ఉద్దేశించి, మత ప్రస్తావన చేస్తూ చేసిన వ్యాఖ్యలు హేయమని, కేవలం పబ్లిసిటీ కోసం వివాదాలు సృష్టించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడాన్ని ప్రజాస్వామిక వాదులు అందరూ ఖండించాలని కోరారు. ప్రజా ప్రతినిధులు తమ బాధ్యతల పట్ల మరింత గౌరవంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల పట్ల, శాంతి భద్రతల పట్ల నిబద్ధతతో విధులు నిర్వర్తిసున్న తెలంగాణ పోలీసుల ఖ్యాతిని ఎవరూ విస్మరించలేరని చెప్పారు. అలాంటి వ్యవస్థ మీద మతపరమైన వ్యాఖ్యలు చేయడం అత్యంత గర్హనీయమని, ఈ ఘటనను పోలీసు వ్యవస్థ మనోబలాన్ని దెబ్బతీసే చర్యగా పరిగణిస్తామన్నారు. ఇలాంటి చర్యల పట్ల పోలీసు శాఖ తీవ్రంగా వ్యవహరిస్తుందని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వెంటనే తన అసంబద్ధ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**దిగొచ్చిన కౌశిక్ రెడ్డి..**

ఓవైపు ఐపీఎస్ అసోసియేషన్, మరోవైపు తెలంగాణ పోలీసు అధికారుల సంఘం సీరియస్ అవ్వడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వెనక్కి తగ్గారు. పోలీసులు అధికారులంటే తనకు గౌరవం ఉందని, ఐపీఎస్ అధికారులను తప్పుగా మాట్లాడలేదని, ఉద్దేశపూరకంగా అవమానించలేదని, క్షమాపణలు చెబుతూ ప్రకటన విడుదల చేశారు. తమను అడ్డుకోవడంతో ఫ్రస్ట్రేషన్ ఒత్తిడితో తెలియకుండా నోరు జారాను తప్ప, ఉద్దేశపూర్వకంగా అన్న మాటలు కాదన్నారు. తన మాటల వల్ల ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి క్షమాపణలు తెలియజేస్తున్నానన్నారు. తప్పుడు ప్రచారం చేయొద్దని, ఈ వివాదం ఇక్కడితో ముగించాలని కౌశిక్ రెడ్డి కోరారు.

**కౌశిక్ రెడ్డి ఆరోపణలు ఖండించిన ఐపీఎస్ అసోసియేషన్..**

కరీంనగర్ సీపీ గౌస్ ఆలం ఐపీఎస్‌పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఐపీఎస్ అసోసియేషన్. తీవ్రంగా ఖండించింది. ఎమ్మెల్యే ఆధారాలు లేని దురుద్దేశ పూరకంగా ఆరోపణలు చేశారంటున్నారు. ఎమ్మెల్యేపై తక్షణం చర్యలు తీసుకోవాలని, పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను మతం పేరుతో దూషించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న అధికారిపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం, మత మార్పిడి వంటి ఆధారాలు లేని ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు. ఈ ఘటన సివిల్ సర్వీసుల మానసిక స్థైర్యం దెబ్బతీసేలా ఉందన్నారు.

## అలీబాబా 40 దొంగల ముఠలా
# కాంగ్రెస్ ప్రభుత్వం

- **సమస్యలను పక్కదారి పట్టించడానికే సిట్ నోటిసులు**
- **తెలంగాణ ప్రదాత కేసీఆర్ పై కుట్రలు మానుకోవాలి**
- **బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం అలీబాబా 40 దొంగల ముఠలా ప్రవర్తిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని రంగదాంపల్లి అమర వీరుల స్థూపం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. టెలి ఫోన్ ట్యాపింగ్ పేరుతో బీఆర్ఎస్ పై వేదింపులను దారవాహిక సీరియల్ తరహాలో రెండేళ్ల నుంచి కొనసాగుతోందని విమర్శించారు.

రేవంత్ రెడ్డి అసలు సమస్యలను పక్కదారి పట్టించి ప్రతిపక్ష నాయకులను వేదిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు అనేక కుంభకోణాలు చేస్తున్నారన్నారు. వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్ రెడ్డి ఈ నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కడం కోసం సిట్ పేరిట కుట్రలు కొనసాగుతున్నాయన్నాయని చెప్పారు. రాజకీయ నాయకులకు ట్యాపింగ్ తో ఎలాంటి సంబంధం ఉండదన్నారు. 1875లోనే ట్యాపింగ్ పై చట్టం వచ్చిందని, టెలిగ్రాఫ్ చట్టం ప్రకారం పోలీసు శాఖ సమాచారం సేకరిస్తుందని గుర్తు చేశారు. ఏ ముఖ్యమంత్రి కూడా ట్యాపింగ్ చేయమని ఎవరికి చెప్పరన్నారు.

తెలంగాణ తెచ్చిన నేత కేసీఆర్ ను వేదించడం అప్రజాస్వామికమన్నారు. పద్నాలుగేళ్లు మడమ తిప్పని పోరాటం చేసి తెలంగాణ తేవడమే కేసీఆర్ చేసిన నేరమా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కక్ష్యతోనే కేసీఆర్ కు నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ కొండా సురేఖ, సీతక్క పలు కార్యక్రమాలకు రావాలని ఎర్రవెల్లికి వెళ్లి ఆహ్వానిస్తారు, కానీ పోలీస్ అధికారులు నందిని నగర్ ఇంటికి వెళ్లి నోటీసులు ఇవ్వడమేమి టన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ప్రతీకార వాంఛతో పనిచేస్తున్నారన్నారు. ఎలక్షన్ ఆఫిడవిట్ లో హరీష్ రావు అడ్రస్ సిద్దిపేట లో ఉంటే, హైదరాబాద్ ఇంటి అడ్రస్ కు నోటీస్ ఎలా ఇచ్చారని అడిగారు. రేవంత్ రెడ్డికి రాష్ట ప్రజలు శిక్ష వేయడం ఖాయమని స్పష్టం చేశారు.



# ఇక అన్నీ మంచి శకునములే !

- **- 18 నుంచి శుభ ఘడియలు**

**ముద్ర న్యూస్:**

యాభై రోజులుగా ఎటువంటి శుభ కార్యక్రమాలకు అవకాశం లేకుండా పోయింది. ఎక్కడా పెళ్లి బాజాలు మోగలేదు, ఏ విధమైన శుభాలకు వీలు చిక్కలేదు. అయితే మరి కొద్ది రోజుల్లో ఆ పరిస్థితి మారబోతోంది. మళ్లీ డుం డుం బాజాల మోత మోగనుంది. అంతే కాదు, పచ్చని తోరణాలతో లోగిళ్లు శుభ కార్యక్రమాలతో సందడి చేయనున్నాయి. ఈ నెల 18 నుంచి శుభ ఘడియలు రానున్నట్లు పండితులు చెబుతున్నారు.

**మౌఢ్యమితో అంతా:**

శుక్ర మౌఢ్యమితో నవంబర్ నెలాఖరు నుంచి వివాహాది కార్యక్రమాలు జరుగలేదు. ఈ మధ్యలో మార్గశిర మాసం పూర్తి అయిపోయింది. పుష్య మాసం ఎటూ శూన్య నెలనే. అయితే వివహాలకు ఎంతో కీలకమైన మాఘ మాసం కూడా దాదాపుగా పూర్తి కావస్తున్న వేళ శుక్ర మౌఢ్యమి వెళ్లిపోతోంది. ఫిబ్రవరి నెల ఎంట్రీ ఇస్తూనే శుభాలకు స్వాగతం పలకనుంది. ఫిబ్రవరి 17 దాకా శుక్ర మూఢమి ఉంటుందని పండితులు చెబుతున్నారు. మాఘ మాసం తరువాత ఫాల్గుణం, చైత్రం, వైశాఖం నెలలు అన్నీ కూడా శుభ మాసాలే కావడంతో జోరుగా వివాహాలు జరగనున్నాయని అంటున్నారు.





**పెళ్లిళ్లకు రెడీ కావచ్చు:**

గడచిన రెండు నెలలుగా పెళ్లిళ్లు నిలిచిపోయాయి. ఈ నెల18 నుంచి ఏకంగా మే 9 వరకూ మూడు నెలల పాటు మంచి ముహూర్తాలు ఉన్నాయని చెబుతున్నారు. కేవలం వివాహాలు మాత్రమే కాకుండా గృహ ప్రవేశాలు, కొత్త గృహాలకు శ్రీకారం చుట్టడం, ఉప నయనాలు వంటి అనేక కార్యక్రమాలు ఈ శుభ ముహూర్తాల్లో చేసుకోవచ్చని పండితులు చెబుతున్నారు.

**శుక్రుడు పవర్ ఫుల్:**

హిందూ సంప్రదాయాలలో గ్రహాలకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. గురువు, శుక్రుడు గ్రహాలు ఎంతో మేలు చేస్తాయని నమ్మకం ఉంది. అయితే ఈ రెండు గ్రహాలు సూర్యుడికి అతి దగ్గరగా వచ్చినపుడు వాటి శక్తిని కోల్పోతాయి. దాంతో ఆ సమయంలో ఈ గ్రహాల శక్తి ప్రసరించనందున వాటిని మౌఢ్యం అని అంటారు. అందుకే గురు, శుక్ర మౌఢ్యాలు వచ్చినపుడు శుభ కార్యక్రమాలు చేసుకోరు. శుక్ర గ్రహం అనుగ్రహం ఉంటే ప్రతీ ఇంట్లో సంతోషం, జీవితంలో స్థిరత్వంతో పాటు శాంతి సమకూరుతాయని నమ్ముతారు. అందుకే శుక్ర మూఢం వెళ్లేంతవరకూ ఎవరూ శుభ కార్యక్రమాలు జరుపుకోకుండా ఎదురుచూస్తున్నారు.

**అధిక జేష్టంతో ..**

ఈ ఏడాది అధిక జేష్ట మాసం ఉంది. అది మే నెల 17 నుంచి జూన్ 15 వరకూ కొనసాగుతుంది. ఈ అధిక మాసంలో కూడా మంచి ముహూర్తాలు ఉండవని అంటున్నారు. ఇక నిజ జేష్టం జూన్ 16 నుంచి మొదలవుతుంది. దాంతో జేష్ట మాసంలో మళ్లీ వివాహాలు, ఇతర శుభాలకు మంచి రోజులు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఈ నెల18 నుంచి మొదలయ్యే శుభ ఘడియలు మూడు నెలల పాటు కొనసాగుతాయి.

## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**ఆందోల్, ముద్ర ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, అజారుద్దీన్ కోరారు. శనివారం గాంధీభవన్ లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు కాంగ్రెస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ సురేష్ షెట్కార్, పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు డా. సంజీవరెడ్డి, మదన్ మోహన్ రావు, తోట లక్ష్మికాంతారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ, మాజీ మంత్రి చంద్రశేఖర్, టీజీ ఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, పార్టీ ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.



# పుర ఎన్నికలు మా పాలనకు రెఫరెండం

- **మున్సిపల్ ఎన్నికలను సెమీ ఫైనల్స్ గా భావిస్తున్నాం**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
- **ఖమ్మం, మహబూబాబాద్, జనగాం జిల్లాల్లో మంత్రి విస్తృత ప్రచారం**

**ముద్ర, ఖమ్మం/ మహబూబాబాద్:**

రాష్ట్రంలో ఈ నెల 11న జరుగనున్న మున్సిపల్ ఎన్నికలు రెండేళ్ల తమ కాంగ్రెస్ పాలనకు రెఫరెండం అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. శనివారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, వర్ధన్నపేట జనగాం మున్సిపాలిటీల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం సెమీ ఫైనల్‌స్‌గా భావిస్తోందని చెప్పారు. పుర ఎన్నికల్లో తమకు సరైన పోటీయే లేదన్నారు. కలిసి వచ్చే పార్టీలకు కాంగ్రెస్ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు.

గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప, సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమీషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు తమ కళ్లముందే కూలిపోతోందన్నారు. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు. ఇటీవల నిర్వహించిన పంచాయితీ రాజ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మంచి ఆధిక్యత వచ్చిందన్నారు. పురపాలికల్లో కూడా అలాంటి ఫలితాలే పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకమై పనిచేసే వారికే, కార్యకర్తలకే కాంగ్రెస్ టిక్కెట్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. తమతో కలిసి వచ్చే పార్టీలకు కాంగ్రెస్ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. గతంలో ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రతి ఎన్నికను ప్రభుత్వ పనితీరుకు రిఫరెండం అని ప్రకటించి భంగపడ్డారని చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు వారిని తిరస్కరించారని గుర్తు చేశారు. తొర్రూరు పట్టణంలో పర్యటించిన పొంగులేటి... ఆ మున్సిపాల్టీని తాను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్న తాను తన నియోజకవర్గంతో



సమానంగా ఈ మున్సిపాల్టీని అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ ఎమ్మెల్యే, ఎంపీతో సహా అందరూ కాంగ్రెస్ వారేనని గుర్తు చేశారు. తొర్రూరు పురపాలికలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రగతి పథకాల అమలు మరింత సులువు అవుతుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రావన్ ను గెలిపించాలని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ప్రపంచంలో అధిక ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలు

8. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్
ప్రపంచంలో అగ్ర చమురు ఉత్పత్తిదారుల్లో ఒకటి. అబుదాబి ప్రాంతంలో ఎక్కువ నిల్వలు ఉన్నాయి

# తాతపై ప్రేమతో..

- సిట్ నోటీసుల వేళ ఫామ్‌హౌస్‌లో కేసీఆర్
- హిమాన్షు పోస్ట్‌తో ఎమోషనల్ టచ్
- రాజకీయ ఒత్తిడుల్లోనూ ప్రశాంత సందేశం
- #KCRFarmer ట్రెండ్
- వ్యక్తిగత భావోద్వేగమా? రాజకీయ వ్యూహమా?



**ముద్ర న్యూస్ :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటింది. సజాబుగానే పాలన సాగుతోంది. అయితే విపక్షాలు ఎన్నికల షమయంలో ఇచ్చిన హామీలపై అధికార పార్టీని నిలదీస్తున్నాయి. ఇక రేవంత్‌రెడ్డి కూడా ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిన సమయంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీ స్తున్నారు. తాజాగా సింగరేణి బొగ్గు గని టెండర్ల విషయం ప్రభుత్వానికి నెగెటివ్‌గా మారడంతో ఫోన్ ట్యాపింగ్ కేసు తెరపైకి తెచ్చారు. హరీశ్‌రావు, కేటీఆర్‌కు సిట్‌తో నోటీసులు ఇచ్చి విచారణ చేయించారు. ఇక ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. కేసీఆర్ సమయం కోరడంతోపాటు ఫామ్‌హౌస్‌లో విచారణ చేయాలని లేఖ రాశారు. కానీ సిట్ కేసీఆర్ రిక్వెస్ట్‌ను తిరస్కరించింది. హైదరాబాద్ నందనగర్‌లో విచారణకు ఆదివారం (ఫిబ్రవరి 1న) సిద్ధంగా ఉండాలని మళ్లీ నోటీసులు పంపింది. ఈక్రమంలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో వ్యవసాయం చేయిస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిని కేసీఆర్ మనుమడు, కేటీఆర్ తనయుడు హిమాన్షు ఫేస్బుక్ లో పోస్టు చేశాడు.

**ఫామ్‌హౌస్‌లో వ్యవసాయం చేయిస్తున్న కేసీఆర్..**

హిమాన్షు పోస్టు చేసిన ఫొటోలో కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో వ్యవసాయం చేయిస్తున్నారు. ఈ చిత్రం రాజకీయ ఒత్తిడుల మధ్య ఆయన స్వచ్ఛంద స్థితిని ప్రతిబింబిస్తోంది. హిమాన్షు ఈ ఫొటోతోపాటు 'ఆ గుండెకు మట్టి తాకితే నాకు సంతృప్తి.. మూలాలను మరువని మహోనీయుడు కేసీఆర్' అంటూ రాసిన క్యాప్షన్ ఎమోషనల్ టచ్ ఇచ్చింది.

**స్పందిస్తున్న నెటిజన్లు...**

సిట్ దర్యాప్తు ఒత్తిడిలో ఈ ఫొటో బీఆర్ఎస్ మద్దతుదారులకు ఊరటనిచ్చింది. ఆయన గొర్రెలు, పొలాలతో అనుబంధాన్ని చాటుకున్న ఈ చిత్రం వైరల్ కావడంతో #KCRFarmer హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. నెటిజన్లు ఆయన సరళతను ప్రశంసిస్తూ మీమ్‌లు, కామెంట్లు పెడుతున్నారు. సిట్ నోటీసులు రాజకీయ డైవర్షన్‌గా కనిపించిన సమయంలో తాజా కేసీఆర్ ఫొటో బీఆర్ఎస్ ఇమేజ్‌ను రీబ్రాండ్ చేస్తోంది. కేసీఆర్ రైతు మూలాలు, స్థిరత్వాన్ని హైలైట్ చేస్తూ సపోర్టర్లను ఏకం చేస్తుంది. ఇది కేవలం వ్యక్తిగత ఉత్సాహమా లేక రాజకీయ కౌంటర్‌గా వ్యూహాత్మకంగా రూపొందించినదా అనేది చర్చనీయాంశంగా మారింది.



# గత రెండేళ్లలో ఏ అభివృద్ధి జరిగింది?

**ముద్ర, నారాయణపేట :**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి ప్రజలను కోరారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో నిరాదరణకు గురైన చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను సాక్షిగా చేసుకొని విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో కలిసి టీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫామ్‌లను అందజేశారు. అనంతరం రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ హయాంలోనే జిల్లాను సాధించుకున్నామని గుర్తుచేశారు. అలాంటి జిల్లాను కాంగ్రెస్ రద్దు చేస్తామని చెప్పడం బాధాకరమని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో సరైన వైద్య సేవలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. ఆసుపత్రిని ఊరి బయటకు తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గడిచిన రెండేళ్లలో జిల్లా కేంద్రంలో జరిగిన అభివృద్ధి ఏదైనా ఉందా? అని నిలదీశారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. మళ్లీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.



## అమెరికాలో మరోసారి షట్‌డౌన్..

**ముద్ర న్యూస్ :**

అమెరికా ప్రభుత్వం మరోసారి షట్‌డౌన్‌కు గురైంది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రితో ముగియడంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోయాయి. ఈమేరకు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. మినియాపొలిస్‌లో ఇటీవల ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారుల కాల్పుల్లో ఇద్దరు ఆందోళనకారులు మృతి చెందడంతో సెనెట్ డెమోక్రాట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "చట్టాన్ని అమలు చేసే అధికారులకు అమెరికా ప్రజలు మద్దతు ఇస్తారు. సరిహద్దు భద్రతా దళాలకు కూడా సహకరిస్తారు. కానీ వీధుల్లో భయభ్రాంతులు సృష్టిస్తూ అమెరికా పౌరులను హతమార్చే ఐసీఈ అధికారులను ఉపేక్షించరు" అంటూ వారు ఘాటుగా స్పందించారు. ఈ ఘటనపై సంస్కరణలు చేపట్టకపోతే నిధుల విడుదల బిల్లుకు అవసరమైన ఓట్లు వేయబోమని డెమోక్రాట్లు హెచ్చరించారు. దీంతో హోంలాండ్ భద్రత శాఖతో పాటు ఇతర విభాగాలకు నిధులు నిలిచిపోనున్నాయి. అయితే ఇది పాక్షిక షట్‌డౌన్ మాత్రమేనని, వచ్చే వారం నిధుల బిల్లుపై మరోసారి చర్చలు జరగనున్నాయని చట్టసభ సభ్యులు తెలిపారు. గతేడాది అక్టోబర్ 1న కూడా అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ అయింది. ఆ దేశ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘంగా 43రోజులు కొనసాగిన షట్‌డౌన్‌గా ఇది నమోదైంది. అమెరికాలో షట్‌డౌన్ ప్రారంభమైతే ఎంతకాలం కొనసాగుతుందో అంచనా వేయడం కష్టమే. 1981 నుంచి ఇప్పటివరకు అమెరికా ప్రభుత్వం 16సార్లు మూతపడింది. 201819 మధ్యకాలంలో దాదాపు 35రోజులపాటు ప్రభుత్వ కార్యకలాపాలు నిలిచిపోగా, ఆ సమయంలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు.

# లడ్డూల్లో నెయ్యి పేరుతో కెమికల్స్ వినియోగం

- 'క్లీన్ షీట్' అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం
- టీటీడీ పవిత్రతను కాపాడడం మన అందరి బాధ్యత-
- మంత్రి నాదెండ్ల మనోహర్



**ముద్ర, గుంటూరు :**

తిరుమల తిరుపతి దేవస్థానంలో గతంలో జరిగిన కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. గత ఏడాది టీటీడీలో నెయ్యి సరఫరా పేరుతో జరిగిన కుంభకోణంపై లోతైన విచారణ జరగాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం దర్యాప్తుకు ఆదేశించిందన్నారు. సిట్‌పై నమ్మకం లేదంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా పర్యవేక్షిస్తూ సీబీఐకి అప్పగించిందని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం చార్జ్ షీట్ దాఖలైన నేపథ్యంలో, "మాకు క్లీన్ షీట్ వచ్చిందని" అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కలిగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

**రూ.233 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం..**

భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా, ఆర్థిక లబ్ధి కోసం సుమారు 60లక్షల లీటర్ల నెయ్యి పేరుతో ఒక్క చుక్క నెయ్యి కూడా లేకుండా, గీ వాసన వచ్చేలా కెమికల్స్‌తో తయారు చేసిన పదార్థాన్ని లడ్డూలు, మహాప్రసాదంలో వినియోగించారన్నారు. ఈ వ్యవహారంలో నాలుగేళ్ల కాలంలో సుమారు రూ.233 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని, ఇది దేశవ్యాప్తంగా మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. సీబీఐ సమర్పించిన నివేదికలో, శాంపిల్ సైజ్ చిన్నదిగా ఉండటం వల్ల కొన్ని అంశాలను పూర్తి స్థాయిలో నిర్ధారించలేకపోయినప్పటికీ, సరఫరా చేసిన పదార్థంలో అసలు 'గీ' అనే పదార్థమే లేకుండా, కేవలం గీ వాసన వచ్చేలా కెమికల్స్ కలిపినట్లు నిర్ధారణకు వచ్చిందని మంత్రి తెలిపారు.

**బాధ్యతయుతంగా వ్యవహరించాలి..**

ఈ దర్యాప్తు నివేదికపై సీఎం అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగిందని, అందులో ఎక్కడా "క్లీన్ షీట్" అనే మాటకు ఎక్కడా లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు పండగలు చేసుకుంటూ రోడ్లపైకి వచ్చి ప్రభుత్వంపై దాడులు చేయడం సమాజానికి సిగ్గుచేటు అన్నారు. ప్రతిపక్ష నాయకులు తొందరపడి వ్యాఖ్యలు చేయకుండా, వాస్తవాలను పూర్తిగా తెలుసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో, పారదర్శకంగా, కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరుపుతోందని, ఎంక్వైరీ నివేదికలు మరియు సీబీఐ రిపోర్టులు ప్రజల ముందుకు వచ్చినప్పుడు ప్రజలే నిజానిజాలు అర్థం చేసుకుంటారని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. టీటీడీ పవిత్రతను కాపాడడం మన అందరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు.



# పేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

- - మందుముల పరమేశ్వర్‌రెడ్డి

**ముద్ర, కాప్రా :**

సీఎంఆర్ఎఫ్ పథకం పేదలు, మధ్యతరగతి ప్రజలకు భరోసాగా నిలుస్తోందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ కింద వైద్య బిల్లులను సకాలంలో చెల్లిస్తున్నారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు తప్పకుండా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, రమంతపూర్ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫిక్, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు కాప్రా సాయి గౌడ్‌తోపాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.



# ఆంజనేయస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డిa

**ముద్ర, వనపర్తి :**

వనపర్తి మండలం కాశీంనగర్ శివారులోని ఎర్రగట్టుపై వెలసిన ఆంజనేయస్వామి ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ అనంతరం రెండో వారంలో త్రయోదశి రోజున గుట్టపై ఉన్న ఆంజనేయస్వామికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అయితే గుట్టపైకి వెళ్లే దారి ప్రమాదకరంగా మారిందని, రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, వచ్చే ఏడాది నాటికి గుట్టపైకి రహదారి నిర్మాణం చేపట్టడంతో పాటు ఆలయ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గొల్ల వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాక్య ఆదిత్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**ముద్ర, వనపర్తి :**

వనపర్తి పట్టణంలోని 23వ వార్డుకు చెందిన మురళీధర్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా మురళీధర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే, మృతి కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని, ఏ అవసరం వచ్చినా తనను నిర్భయంగా సంప్రదించవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎత్తం రవి, పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్యరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సమ్మక్కసారలమ్మ జాతరలో ప్రత్యేక పూజలు

- పాపిరెడ్డి కాలనీలో అమ్మవార్లను దర్శించుకున్న ఆరెకపూడి గాంధీ

**ముద్ర, శేరిలింగంపల్లి :**

కూకట్పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీలో గద్దెలపై కొలువుదీరిన సమ్మక్కసారలమ్మలను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ గాంధీ మాట్లాడుతూ సమ్మక్కసారలమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంధం రాములు, చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి, చిరుమర్తి రాజు, కాశీనాథ్ యాదవ్, చర్ల రామకృష్ణారెడ్డి, మహేష్ గౌడ్, అక్కిరెడ్డి, బాల నర్సయ్య, శ్రీకాంత్, గంగుల రాజిరెడ్డి, వావిల్ల బుగ్గయ్య, బాలు యాదవ్, శ్రీధర్ పటేల్, శ్రీనివాస్ రెడ్డి, బాలు, కిషోర్, కిరణ్, రాజేష్, సుధాకర్, టీవీ పద్మ, శోభ రెడ్డి, పద్మ, వెంకటలక్ష్మి, లతా, కవిత, రజిని, ప్రకాష్, వెంకటేష్ మేస్త్రీ, ప్రభాకర్‌తోపాటు కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
01.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రపంచంలో అధిక ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలు**

**10. లిబియా**
ఆఫ్రికాలోనే అతిపెద్ద చమురు నిల్వలు లిబియాకు ఉన్నాయి. అంతర్గత కలహాలు ఉత్పత్తిని దెబ్బతీశాయి.




# టీ20 వరల్డ్ కప్‌కు ముందే ఐసీసీకి కొత్త తలనొప్పి...

- ఆటగాళ్ల హక్కులపై ఐసీసీ, ప్రపంచ క్రికెటర్ల సంఘం మధ్య రగడ
- కొత్త ఒప్పందంతో ప్లేయర్లకు నష్టమంటున్న డబ్ల్యూసీఏ
- ఆరోపణలను తిరస్కరించిన అంతర్జాతీయ క్రికెట్ మండలి
- వివాదం ముదిరితే టోర్నీపై ప్రభావం పడే అవకాశం

ముద్ర,స్పోర్ట్స్

2026 టీ20 వరల్డ్ కప్ ఆరంభానికి ఇంకా చాలా సమయం ఉండగానే, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మరో కొత్త వివాదంలో చిక్కుకుంది. ఆటగాళ్ల హక్కుల విషయంలో ప్రపంచ క్రికెటర్ల సంఘం (డబ్ల్యూసీఏ) ఐసీసీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వరల్డ్ కప్‌లో పాల్గొనే ప్లేయర్ల పేరు, ఫొటో, వీడియో వంటి వాణిజ్య హక్కులకు సంబంధించి ఐసీసీ రూపొందించిన కొత్త నిబంధనలపై డబ్ల్యూసీఏ అభ్యంతరం తెలిపింది.

గతంలో కుదిరిన ఒప్పందానికి భిన్నంగా కొత్త నిబంధనలు ఉన్నాయని, దీనివల్ల ఆటగాళ్ల హక్కులకు భంగం కలుగుతోందని డబ్ల్యూసీఏ ఆరోపించింది. ముఖ్యంగా మీడియా కార్యక్రమాలు, డ్రెస్సింగ్ రూమ్ యాక్సెస్, వ్యక్తిగత సమాచార వినియోగం వంటి అంశాల్లో ప్లేయర్లకు నష్టం జరుగుతుందని పేర్కొంది. ఈ కొత్త నిబంధనల వల్ల చిన్న దేశాల ఆటగాళ్లు ఎక్కువగా ప్రభావితమవుతారని, వరల్డ్ కప్ చాలా మందికి జీవనాధారమని డబ్ల్యూసీఏ సీఈవో టామ్ మోఫాట్ అన్నారు.

**డబ్ల్యూసీఏ ఆరోపణలను ఖండించిన ఐసీసీ**

అయితే, ఐసీసీ ఈ ఆరోపణలను ఖండించింది. 2024లో కుదిరిన ఒప్పందం కేవలం కొన్ని దేశాలకు మాత్రమే వర్తిస్తుందని, అన్ని జట్లకు కాదని స్పష్టం చేసింది. మరోవైపు డబ్ల్యూసీఏ మాత్రం అన్ని దేశాల ఆటగాళ్లకు ఒకే విధమైన నిబంధనలు ఉండాలని డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే తమకు మద్దతిస్తున్న ఆటగాళ్లతో ఒప్పందాలపై సంతకాలు కూడా చేయించుకున్నట్లు తెలిపింది. భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7 నుంచి ఈ మెగా టోర్నీ జరగనుంది. ఈ లోగా ఈ వివాదం పరిష్కారం కాకపోతే, టోర్నమెంట్ నిర్వహణపై ప్రభావం పడే అవకాశం ఉందని క్రీడా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# సంజు శాంసన్‌కు ఏమైంది?



ముద్ర,స్పోర్ట్స్

అదే నిర్లక్ష్యం. అదే బాధ్యతరాహిత్యం.. మైదాన మారుతోంది. మిగతా ఆటగాళ్ల ఆటతీరు కూడా మారుతోంది. కానీ అతని ఆట తీరు మాత్రం ఏమాత్రం మారడం లేదు. పైగా పరుగులు తీయలేకపోతున్నాడు. వికెట్ కాపాడుకోలేకపోతున్నాడు. అన్నిటికంటే ముఖ్యంగా దారుణంగా అవుట్ అవుతున్నాడు.

ఇదంతా చెప్పేది టీమిండియా యంగ్ బ్యాటర్ సంజు శాంసన్ గురించి. న్యూజిలాండ్ తో చివరి ఐదవ టి20 మ్యాచ్ తిరువనంతపురంలో జరుగుతోంది. తిరువనంతపురం అనేది సంజు శాంసన్ కు సొంత మైదానం. ప్రస్తుత సిరీస్లో సంజు అంతగా ఆకట్టుకోలేకపోతున్నాడు. భారీగా పరుగులు చేయలేకపోతున్నాడు. సమర్థవంతంగా పరుగులు చేయలేక వికెట్ పారేసుకుంటున్నాడు. ఇలా నాలుగు సందర్భాల్లో అదే జరిగింది.

తిరువనంతపురం సొంత మైదానం కావడంతో సంజు అదరగొడతాడని అందరూ అనుకున్నారు. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ కూడా తిరువనంతపురంలో సంజు సమర్థవంతమైన ప్రదర్శన చేస్తాడని ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. టి20 వరల్డ్ కప్ ముందు సంజు స్థానాన్ని కదిలిస్తే అది మొదటికే మోసం వస్తుందని భావించిన గంభీర్, సూర్య కుమార్ యాదవ్.. అతడికి వరుసగా అవకాశాలు ఇచ్చుకుంటూ వస్తున్నారు. అయితే సంజు మాత్రం వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నాడు.

నాలుగో టి20 మ్యాచ్లో అభిషేక్ శర్మ, సూర్య కుమార్ యాదవ్ వరుసగా అవుట్ అయినప్పుడు.. నిలబడి సమర్థవంతంగా బ్యాటింగ్ చేయాల్సిన సంజు అవుట్ అయ్యాడు. ఇక శనివారం నాడు తిరువనంతపురంలో జరుగుతున్న ఐదవ టి20 మ్యాచ్లో కూడా అదే విఫల ప్రదర్శన చేశాడు. ఆరు పరుగులు చేసిన అతడు ఫెర్గు సన్ బౌలింగ్లో జాకబ్ పట్టిన క్యాచ్ కు అవుట్ అయ్యాడు. అలా అతడి అవుట్ కావడంతో తిరువనంతపురం ప్రేక్షకులు ఒక్కసారిగా ఢీలా పడిపోయారు. వాస్తవానికి ఈ మైదానం మీద సంజు శాంసన్ కు మెరుగైన రికార్డు ఉంది. కానీ అతడు ఈ మ్యాచ్లో కొనసాగించలేకపోయాడు. అన్నింటికంటే ముఖ్యంగా మరోసారి సింగిల్ డిజిట్ స్కోర్ కు ఔట్ అయి.. పరువు తీసుకున్నాడు.

సంజు విఫలమైన ఆట తీరు ప్రదర్శిస్తున్న నేపథ్యంలో టి20 వరల్డ్ కప్ లో అతడికి తుది జట్టులో చోటు దక్కుతుందా? అనే అనుమానాలు అభిమానులలో వ్యక్తమవుతున్నాయి. ఇషాన్ కిషన్, శివం దుబే భీకరమైన ఫామ్ లో ఉన్న నేపథ్యంలో సంజుకు తుది జట్టులో చోటు దక్కేది అనుమానమేనని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

# సూర్యకు ఆ గుర్తింపు దక్కడం లేదు..

- టీమిండియా మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్

ముద్ర,స్పోర్ట్స్








టీమిండియా టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ ప్రదర్శనకు తగిన గుర్తింపు రావడం లేదని భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. సూర్య నాయకత్వ శైలిలో రోహిత్ శర్మ తరహా లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అతడు పేర్కొన్నాడు. ముఖ్యంగా బౌలర్లను వినియోగించుకునే విషయంలో సూర్య తీసుకునే నిర్ణయాలు జట్టుకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఇర్ఫాన్ విశ్లేషించాడు.

టీ20 ఫార్మాట్‌లో కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్‌కు అద్భుతమైన విజయ శాతం ఉందని, దాదాపు 84 శాతం మ్యాచ్‌ల్లో జట్టును గెలుపు బాట పట్టించాడని ఇర్ఫాన్ గుర్తు చేశాడు. అయినా కూడా అతడి నాయకత్వానికి తగినంత ప్రశంసలు రావడం లేదన్నది తన అభిప్రాయమని చెప్పాడు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం, ఆటగాళ్లపై నమ్మకం ఉంచడం వంటి లక్షణాలు సూర్యలో స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపాడు.

అయితే కెప్టెన్‌గా రాణిస్తున్నప్పటికీ, బ్యాటర్‌గా సూర్యకుమార్ యాదవ్ మరింత బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని ఇర్ఫాన్ సూచించాడు. సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే, కెప్టెన్సీతో పాటు బ్యాటింగ్‌లోనూ అతడు జట్టుకు కీలకంగా మారతాడని అభిప్రాయపడ్డాడు. వరల్డ్‌కప్ జట్టులో చోటు దక్కడం దాదాపు ఖాయమే అయినా, పరుగులే అతడికి అసలైన బలం అవుతాయని స్పష్టం చేశాడు.

ఇటీవలి కాలంలో సూర్య ఫామ్ సమస్యతో ఇబ్బంది పడిన మాట వాస్తవమే. 2025లో 21 ఇన్నింగ్స్‌లు ఆడిన అతడు కేవలం 218 పరుగులకే పరిమితమయ్యాడు. అయితే టీ20 వరల్డ్‌కప్ 2026కు ముందు అతడు మళ్లీ తన పాత రిథమ్‌ను అందుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో రెండు మ్యాచ్‌ల్లో వరుసగా అర్ధశతకాలు సాధించి ఫామ్‌లోకి వచ్చాడు.

ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌లో సూర్యకుమార్ యాదవ్ బ్యాట్‌తోనూ, కెప్టెన్‌గా కూడా జట్టుకు కీలకంగా నిలవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# యాభై వికెట్ల క్లబ్‌లో అర్జున్ టెండూల్కర్

భారత దిగ్గజ క్రికెటర్ సచిన్‌టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో కీలక మైలురాయిని అందుకున్నాడు. గోవా తరఫున రంజీట్రోఫీలో మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో అతడు 50 వికెట్ల క్లబ్‌లో చేరాడు. 2022-23 సీజన్‌లో గోవా జట్టుతో ఫస్ట్‌క్లాస్ అరంగేట్రం చేసిన అర్జున్, తొలి మ్యాచ్‌లోనే రాజస్థాన్‌పై సెంచరీతో పాటు ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

ఈ రంజీ సీజన్‌లోనే అతడు 13 వికెట్లు సాధించడం విశేషం. ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో 50 వికెట్లు పూర్తి చేసినప్పటికీ, సచిన్ సాధించిన 71 వికెట్లకు ఇంకా వెనుకబడ్డాడు. ముంబయి నుంచి గోవాకు మారిన తర్వాత అర్జున్ ఆల్‌రౌండర్‌గా మెరుగైన ప్రదర్శన కొనసాగిస్తున్నాడు. ఐపీఎల్‌లో గతంలో ముంబయి ఇండియన్స్‌కు ఆడిన అతడు, 2026 సీజన్‌కు లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్‌కు ట్రేడ్ ద్వారా వెళ్లాడు.



# ఆస్ట్రేలియన్లకు ఏమైంది?

ముద్ర,స్పోర్ట్స్

పాకిస్తాన్ మీద టీ 20 లలో ఆస్ట్రేలియా జట్టుకు మెరుగైన రికార్డు ఉంది. పైగా అనేక సిరీస్ లను ఆస్ట్రేలియా గెలిచింది. ఐసీసీ నిర్వహించే మెగా టోర్నీలే కాదు.. ద్వైపాక్షిక సిరీస్ లలో కూడా ఆస్ట్రేలియా దే పాకిస్తాన్ మీద పై చేయి.

ప్రస్తుతం పాకిస్తాన్ దేశంలో ఆస్ట్రేలియా పర్యటిస్తోంది. మూడు టీ 20 మ్యాచ్ ల సిరీస్ లో పాకిస్తాన్, ఆస్ట్రేలియా తలపడుతున్నాయి. వాస్తవానికి ఈ సిరీస్ కు ముందు పాక్ జట్టు పరిస్థితి ఏ మాత్రం బాగోలేదు. జట్టులో అంతర్గత సమస్యలు.. ఆటగాళ్ల ఫామ్ లేమి పాకిస్తాన్ జట్టును ఇబ్బంది పెట్టాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా జట్టు సిరీస్ గెలుస్తుందని అందరు అనుకున్నారు. కానీ, పాక్ గడ్డమీద అడుగుపెట్టిన తర్వాత ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఆస్ట్రేలియా జట్టు సిరీస్ గెలవాల్సింది పోయి.. పాకిస్తాన్ చేతిలో వరుసగా రెండు మ్యాచ్ లు ఓడిపోయింది.

3 t20 మ్యాచ్ల సిరీస్లో తొలి మ్యాచ్ లాహోర్ గడాఫీ స్టేడియంలో జరిగింది. ఈ మ్యాచ్లో పాకిస్తాన్ ఫస్ట్ బ్యాటింగ్ చేసి 8 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసింది. ఆ తర్వాత చేజింగ్ మొదలుపెట్టిన ఆస్ట్రేలియా జట్టు 146 పరుగులకు ఆల్ అవుట్ అయింది. తద్వారా పాకిస్తాన్ జట్టు 22 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. శనివారం లాహోర్ మైదానంలోని జరిగిన రెండవ టి20 మ్యాచ్లో పాక్ ఈసారి ఏకంగా 90 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫర్హాన్ (5), అయూబ్(23) విఫలమైనప్పటికీ.. కెప్టెన్ సల్మాన్ (78) సత్తా చూపించాడు. ఉస్మాన్ ఖాన్ (53) అదరగొట్టాడు. ఆస్ట్రేలియా బౌలర్లు అంతగా ప్రతిభ చూపలేకపోయారు. జంపా మాత్రమే కాస్త మెరుగ్గా బౌలింగ్ చేశాడు.

ఆ తర్వాత చేజింగ్ మొదలుపెట్టిన ఆస్ట్రేలియా జట్టు 108 పరుగులకు కుప్పకూలింది. ఆస్ట్రేలియా జట్టులో గ్రీన్ (35) మాత్రమే టాప్ స్కోరర్ గా నిలిచాడు. పాకిస్తాన్ బౌలర్లలో అబ్రార్ అహ్మద్, షాదాబ్ ఖాన్ చెరి మూడు వికెట్లు పడగొట్టారు. ఉస్మాన్ తారిఖ్ రెండు వికెట్లు సాధించాడు. 22 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన ఆస్ట్రేలియా జట్టు.. ఏ దశలో కూడా కోలుకోలేదు.




# టీ20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ ఆడేది అనుమానమే?

- ప్రభుత్వ అనుమతిపై పీసీబీ ఎదురుచూపులు

ముద్ర,స్పోర్ట్స్

టీ20 ప్రపంచకప్-2026కు సన్నాహాలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికలుగా ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. అయితే ఈ ప్రపంచకప్‌లో పాకిస్తాన్ పాల్గొంటుందా? లేదా? అన్నదానిపై ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. ఒకవైపు టోర్నీ కోసం జట్టును శ్రీలంకకు పంపేందుకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేసిందన్న వార్తలు వినిపిస్తుండగా, మరోవైపు ప్రభుత్వ అనుమతి కోసం ఇంకా ఎదురు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే ఫిబ్రవరి 2న పాకిస్తాన్ జట్టు శ్రీలంకకు బయలుదేరే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టీ20 సందర్భంగా కొత్త వరల్డ్‌కప్ జెర్సీని విడుదల చేస్తామని పీసీబీ ముందుగా ప్రకటించింది. కానీ అనుమతి విషయంలో స్పష్టత లేకపోవడంతో ఆ జెర్సీ లాంచ్ కార్యక్రమాన్ని రద్దు చేసింది.

పాక్ పాల్గొనడంపై తుది నిర్ణయం సోమవారం వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఈ టోర్నీ నుంచి బంగ్లాదేశ్ తప్పుకున్న సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌కు మద్దతుగా పీసీబీ కూడా బహిష్కరణ హెచ్చరికలు చేసినా, ఐసీసీ జోక్యంతో ఆ నిర్ణయంపై వెనక్కి తగ్గింది. అయినప్పటికీ టోర్నీలో పాల్గొంటున్న విషయంపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా చేయలేదు. ప్రస్తుతం పాకిస్తాన్ జట్టు స్వదేశంలో ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడుతోంది.

టీ20 ప్రపంచకప్-2026కు పాకిస్తాన్ జట్టు: సల్మాన్ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజం, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, ఖవాజా నఫే, మహ్మద్ నవాజ్, సల్మాన్ మీర్జా, నసీమ్ షా, సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, షాహీన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తారిక్.




# ఆస్ట్రేలియాకు భారీ షాక్

- టీ20 ప్రపంచకప్‌కు స్టార్ ఆల్ రౌండర్ దూరం

ముద్ర, స్పోర్ట్స్

టీ20 ప్రపంచకప్-2026కు ఆస్ట్రేలియా తుది జట్టును ప్రకటించింది. అయితే ఈ జట్టులో మాజీ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ పేరు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. తొలుత ప్రకటించిన ప్రాథమిక జట్టులో కమ్మిన్స్‌కు చోటు దక్కినా, వెన్నునొప్పి (లంబర్ స్ట్రెస్ ఇంజరీ) నుంచి పూర్తిగా కోలుకోలేకపోవడంతో తుది జట్టుకు దూరమయ్యాడు. దీంతో టోర్నమెంట్‌కు ముందు ఆసీస్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లైంది.

భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ మెగా టోర్నీ ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానుంది. మొత్తం 20 జట్లు పాల్గొనే ఈ ప్రపంచకప్‌ను నాలుగు గ్రూపులుగా విభజించారు. ఆస్ట్రేలియా గ్రూప్-బీలో ఉండగా, ఆ గ్రూప్‌కు సంబంధించిన అన్ని మ్యాచ్‌లు శ్రీలంకలో జరగనున్నాయి. జట్టులో మార్పులు చేసుకునేందుకు జనవరి 31 చివరి తేదీగా ఉండటంతో, ఆలోపే ఆసీస్ సెలెక్టర్లు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

కమ్మిన్స్‌తో పాటు మాథ్యూ షార్ట్ కూడా తుది జట్టులో చోటు కోల్పోయాడు. వీరి స్థానాల్లో మాట్ రెన్షా, బెన్ ద్వార్షుయిస్‌లను ఎంపిక చేశారు. అనుభవజ్ఞుడైన కమ్మిన్స్ లేకపోవడం లోటే అయినప్పటికీ, మిచెల్ మార్ష్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా జట్టు సమతూకంగా కనిపిస్తోంది. ట్రావిస్ హెడ్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, టిమ్ డేవిడ్, జోష్ ఇంగ్లిస్, కామెరాన్ గ్రీన్ వంటి మ్యాచ్ విన్నర్లు జట్టుకు బలంగా నిలుస్తున్నారు.




టీ20 ప్రపంచకప్-2026కు ఆస్ట్రేలియా జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్లెట్, టిమ్ డేవిడ్, కూపర్ కనోలీ, బెన్ ద్వార్షుయిస్, కామెరాన్ గ్రీన్, ట్రావిస్ హెడ్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ ఎల్లిస్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమన్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, మాట్ రెన్షా, ఆడమ్ జంపా.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రపంచంలో అధిక ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలు**

9. అమెరికా సంయుక్త రాష్ట్రాలు షేల్ ఆయిల్ టెక్నాలజీతో ఉత్పత్తి పెంచింది. చమురు వినియోగం కూడా అత్యధికంగా ఉంటుంది.



# జనవరిలో టాలీవుడ్ బాక్సాఫీస్ లెక్కలివి

2026 తొలి నెల జనవరి వేగంగా ముగిసిపోయింది. ఈ నెల టాలీవుడ్ బాక్సాఫీస్‌పై సంక్రాంతి సినిమాల ప్రభావమే ఎక్కువగా కనిపించింది. నెల ప్రారంభంలో విడుదలైన కొన్ని చిన్న తెలుగు, డబ్బింగ్ చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. పెద్ద పండుగ విడుదలల కోసం జనం ఎదురుచూడటంతో తొలి వారం నిశ్శబ్దంగానే గడిచింది.

రెండో వారం ప్రభాస్ నటించిన 'రాజాసాబ్' భారీ అంచనాలతో రిలీజైనా, నెగిటివ్ టాక్‌తో నిలదొక్కుకోలేక డిజాస్టర్‌గా మిగిలింది. అదే సమయంలో చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' మాత్రం బలమైన స్పందన తెచ్చుకుంది. పెద్ద కొత్తదనం లేకపోయినా చిరంజీవి మ్యాజిక్‌తో సుమారు రూ.350 కోట్ల వసూళ్లు రాబట్టి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.

రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'కు సరైన ఆదరణ దక్కలేదు. నవీన్ పొలిశెట్టి నటించిన 'అనగనగా ఒకరాజు' గ్రామీణ కామెడీగా ప్రేక్షకులను మెప్పించి సక్సెస్ సాధించింది. శర్వానంద్ 'నారీ నారీ నదుమ మురారి' హిట్ టాక్ తెచ్చుకున్నప్పటికీ పండుగ హడావుడిలో పరిమితంగానే ఆడింది.

నెల చివర్లో వచ్చిన కొన్ని చిన్న చిత్రాలు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. మొత్తం మీద జనవరిలో టాలీవుడ్‌కు చిరంజీవి, నవీన్ పొలిశెట్టి, శర్వానంద్ సినిమాలే రిలీఫ్ ఇచ్చాయని చెప్పవచ్చు.





# జన నాయగన్ కు ఆర్థిక కష్టాలు...




- **తళపతి ఏమోషనల్ పోస్ట్**

సినిమాలు, రాజకీయాలు రెండు భిన్నమైన ప్రపంచాలు. రెండింటినీ ఒకేసారి సమతూకంలో నడిపించడం సాధ్యం కాదన్నది ఎన్నోసార్లు రుజువైంది. అందుకే గతంలో ఎన్టీఆర్, చిరంజీవి వంటి నటులు రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు సినిమాలకు పూర్తిస్థాయిలో విరామం ఇచ్చారు. అయితే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రం రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూనే సినిమాలు కొనసాగించారు. ప్రభుత్వ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన సినిమాలకు ఆటంకాలు లేకపోయినా, 2019-24 మధ్యకాలంలో వైసీపీ పాలనలో పవన్ కళ్యాణ్ చిత్రాలు ఎదుర్కొన్న ఇబ్బందులు అందరికీ తెలిసిందే.

ఇప్పుడు ఇదే తరహా పరిస్థితి తమిళ స్టార్ హీరో విజయ్‌కు ఎదురవుతోందన్న చర్చ జోరుగా సాగుతోంది. ఇటీవలే 'టీవీకే' పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విజయ్, డీఎంకే ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీపై తీవ్ర విమర్శలు చేస్తూ ముందుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో జనవరి 9న విడుదల కావాల్సిన ఆయన చిత్రం 'జన నాయగన్' సెన్సార్ సర్టిఫికేట్ లభించక నిలిచిపోయింది. విడుదల ఆగిపోవడంతో నిర్మాతకు భారీ ఆర్థిక నష్టాలు తప్పడం లేదు. అభిమానులు కూడా తమ హీరోను చివరిసారి వెండితెరపై చూడాలన్న ఆశ నెరవేరక నిరాశలో ఉన్నారు.

ఇటీవల ఓ జాతీయ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విజయ్ ఈ అంశంపై స్పందించారు. రాజకీయాల్లోకి వచ్చే ముందు సినిమాలకు పూర్తిగా దూరం కావాలనే కఠిన నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. రాజకీయాలు చేస్తూ సినిమాలు కొనసాగిస్తే నిర్మాతలు లక్ష్యంగా మారతారని భావించి, వారిని ఇబ్బందులకు గురి కాకుండా చూడాలన్నదే తన ఉద్దేశ్యమని చెప్పారు. 'జన నాయగన్' ఎదుర్కొంటున్న సమస్యలు ముందే ఊహించానని, నిర్మాతల పరిస్థితి చూసి చాలా బాధగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. విజయ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీస్తున్నాయి.




# రాజమౌళి ప్లానింగ్ మామూలుగా లేదు..

## ఏప్రిల్ 7న వారణాసి రిలీజ్ పై ఇండస్ట్రీలో చర్చలు

ఎస్.ఎస్. రాజమౌళి సినిమాల రూపకల్పనలోనే కాదు, విడుదల వ్యూహంలోనూ తనదైన ముద్ర వేస్తారన్నది మరోసారి రుజువవుతోంది. సూపర్ స్టార్ మహేశ్ బాబుతో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' విడుదల తేదీగా 2027 ఏప్రిల్ 7ను ఆయన ఖరారు చేయడం వెనుక బలమైన వ్యూహం దాగి ఉంది. ఈ డేట్‌ను ఎంపిక చేయడం కేవలం సమ్మర్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకున్న నిర్ణయం కాదు.. వరుస పండుగలు, సెలవుల లెక్కతో రూపొందించిన సమగ్ర ప్లాన్‌గా ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

సాధారణంగా వ్యక్తిగతంగా మూఢనమ్మకాలకు దూరంగా ఉంటానని చెప్పే రాజమౌళి, బాక్సాఫీస్ విషయంలో మాత్రం పండుగల పవర్‌ను పూర్తిగా వినియోగించుకుంటారు. ఏప్రిల్ 7న ఉగాది ఉండగా, అదే రోజు మహారాష్ట్రలో గుడిపడ్వా వేడుకలు జరుపుకుంటారు. ఉత్తరాదిలోనూ ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న ఈ రోజు సినిమాను విడుదల చేయడం ద్వారా దేశవ్యాప్తంగా భారీ ఓపెనింగ్స్ దక్కించుకోవాలన్నది రాజమౌళి ఆలోచనగా తెలుస్తోంది.

ఇక విడుదలైన వారం రోజుల్లోనే వరుస సెలవులు కలిసి రావడం ఈ సినిమాకు మరింత ప్లస్ కానుంది. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి, 15న శ్రీరామనవమి ఉండటంతో తొలి వారం నుంచే థియేటర్లకు జనసంద్రం తప్పదన్న అంచనాలు ఉన్నాయి. రెండో వారంలోనూ పరిస్థితి అలాగే కొనసాగనుంది. ఏప్రిల్ 18న హనుమాన్ జయంతి, 19న మహావీర్ జయంతి రావడంతో లాంగ్ వీకెండ్స్ కలిసి వచ్చి వసూళ్ల పరంపరను కొనసాగించే అవకాశం ఏర్పడుతుంది. ఈ విధంగా దాదాపు రెండు వారాల పాటు తిరుగులేని బాక్సాఫీస్ రన్‌ను లక్ష్యంగా పెట్టుకుని ఈ తేదీని ఫిక్స్ చేసినట్టు సమాచారం.

కేఎల్ నారాయణ నిర్మాణంలో, కీరవాణి సంగీత సారథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి 1000 నుంచి 1300 కోట్ల వరకు బడ్జెట్ ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి షూటింగ్ పూర్తి చేసి, ఆ తర్వాతి నెలల్ని పూర్తిగా విజువల్ ఎఫెక్ట్స్, ప్రచార కార్యక్రమాలకు కేటాయించనున్నారు. భారతీయ ప్రేక్షకులకే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులను దృష్టిలో పెట్టుకుని ఈ చిత్రాన్ని 'పాన్ వరల్డ్' స్థాయిలో రూపొందిస్తున్నారు.

సమ్మర్ సెలవులు, పండుగల జాతర, దేశవ్యాప్త హాలిడేస్ అన్నింటినీ సమీకరించి రాజమౌళి ఎంచుకున్న ఏప్రిల్ 7 తేదీ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ముందస్తు ప్లానింగ్‌తో బాక్సాఫీస్ రికార్డులు మహేశ్ బాబు ఖాతాలో చేరడం ఖాయమన్న నమ్మకం అభిమానుల్లో బలంగా వినిపిస్తోంది.



# బన్నీ డైరెక్టర్ల జాబితాలో మరో తమిళ డైరెక్టర్

'పుష్ప 2' బ్లాక్‌బస్టర్ తర్వాత అల్లు అర్జున్ వరుసగా కోలీవుడ్ దర్శకులకు ఛాన్స్ ఇస్తూ ఆసక్తికర నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో భారీ సినిమా చేస్తున్న బన్నీ, తదుపరి ప్రాజెక్ట్‌ను లోకేష్ కనగరాజ్‌తో చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

ఇప్పుడు ఈ లిస్టులో 'జైలర్' ఫేమ్ నెల్సన్ పేరు కూడా చేరినట్లు ప్రచారం జరుగుతోంది. నెల్సన్ ఇటీవల బన్నీకి కథ వినిపించాడని, ఆయన ఇమేజ్‌కు తగ్గ యాక్షన్-కామెడీ స్క్రిప్ట్‌కు బన్నీ ఇంప్రెస్ అయినట్లు సమాచారం. అయితే అట్లీ, లోకేష్ సినిమాలు పూర్తయ్యాకే ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉందని అంటున్నారు.

ప్రస్తుతం బన్నీ అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సైంటిఫిక్ యాక్షన్ మూవీ షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా దాదాపు రూ.1300 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి 2027 మార్చిలో విడుదల కానున్నట్లు ప్రచారం. ఇక బన్నీ-లోకేష్ కనగరాజ్ సినిమా ఈ ఏడాది రెండో భాగంలో ప్రారంభం కానుంది







# 94 ఏళ్ల వయసులో మళ్లీ మెగా ఫోన్ పడుతున్న సీనియర్ డైరెక్టర్

వైవిధ్యమైన సినిమాలకు చిరునామాగా నిలిచిన సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మళ్లీ దర్శకత్వం వహించేందుకు సిద్ధమయ్యారు. సుదీర్ఘ విరామం తర్వాత 94 ఏళ్ల వయసులో ఆయన కొత్త చిత్రాన్ని ప్రారంభించడం సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. వైజయంతీ మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమాకు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించడం మరో విశేషం. పూజా కార్యక్రమాలతో మొదలైన ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వీడియోను నిర్మాణ సంస్థ తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రం సింగీతం కెరీర్‌లో 61వ సినిమా కావడం గమనార్హం.

1972లో 'నీతి-నిజాయతీ'తో దర్శకుడిగా ప్రవేశించిన సింగీతం శ్రీనివాసరావు, భారతీయ సినీ చరిత్రలో ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలు అందించారు. 'మయూరి'తో ప్రేరణనిచ్చిన ఆయన, టాకీ యుగంలోనూ 'పుష్పకం విమానం'లాంటి మూకీ చిత్రాన్ని తెరకెక్కించారు. 'విచిత్ర సోదరులు', 'ఆదిత్య 369', 'భైరవ ద్వీపం' వంటి విభిన్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 2013లో 'వెల్‌కమ్ ఒబామా'తో చివరిసారి దర్శకత్వం వహించిన ఆయన, తాజాగా 'కల్కి 2898 ఏడీ'కు సలహాలు ఇచ్చి మరోసారి చర్చలోకి వచ్చారు. ఇప్పుడు మళ్లీ మెగాఫోన్ పట్టి కొత్త ప్రయోగానికి సిద్ధమవడం ఆయన అజేయ సృజనాత్మకతకు నిదర్శనంగా నిలుస్తోంది.



# కోలీవుడ్‌లోకి శ్రీలీల

తెలుగు సినిమాల్లో తన ఎనర్జిటిక్ డ్యాన్స్‌లు, గ్లామర్‌తో యువతలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న శ్రీలీల ఇప్పుడు కోలీవుడ్ వైపు అడుగులు వేస్తోంది. ధనుష్ కథానాయకుడిగా నటిస్తున్న 55వ చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు నిర్మాత వండర్‌బార్ ఫిల్మ్స్ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా వెల్లడించింది. "ఇది ఊహించలేదుకదా" అనే క్యాప్షన్‌తో విడుదలైన పోస్టర్ నెట్టింట వేగంగా వైరల్ అవుతోంది.

రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ధనుష్ లాంటి విభిన్నమైన నటుడితో శ్రీలీల జోడీ కట్టడం కోలీవుడ్‌లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. తెలుగులో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న శ్రీలీలకు, ఈ తమిళ చిత్రం అక్కడ కూడా బలమైన గుర్తింపును తెచ్చిపెడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందించనుండగా, త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది.

దీక్షా సింగ్ తాజాగా తన ట్రాపికల్ చిక్ లుక్ తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. స్టైలిష్ అవుట్‌ఫిట్, నేచురల్ మేకప్‌తో ఆమె లుక్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఫ్యాషన్ పరంగా ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తున్న దీక్షా, ప్రొఫెషనల్ ఫ్రంట్‌లోనూ దూసుకుపోతోంది. దక్షిణాది సినీ పరిశ్రమలో వరుస అవకాశాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తూ, నటిగా బలమైన స్థానం ఏర్పరుచుకుంటోంది

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com